MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 328 | పేజీలు : 8 | మంగళవారం 17 నవంబర్ 2026 | వెల : 6-00

వచ్చే పదేళ్లలో అగ్రగామిగా ఏపీ



కేంద్ర హోం మంత్రి అమిత్ షా.. రామోజీరావు సేవలు దేశానికి స్ఫూర్తిదాయకం

ఆయన స్థాపించిన సంస్థలు తెలుగుజాతి ఆస్తులు

రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా

రామోజీరావు జయంతిని రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహించాలని నిర్ణయం : సీఎం చంద్రబాబు



విజయవాడ, మహానగర్:

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ వచ్చే పదేళ్లలో దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా అగ్రస్థానానికి చేరుకుంటుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు, పారిశ్రామిక అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన వేగంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. పద్మవిభూషణ్ రామోజీరావు 90వ జయంతిని పురస్కరించుకుని విజయవాడలో సోమవారం నిర్వహించిన రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో అమిత్ షా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామోజీరావు వంటి మహనీయులు తమ కృషి, నిబద్ధతతో సంస్థలుగా, వ్యవస్థలుగా ఎదిగి దేశానికి స్ఫూర్తిగా నిలుస్తారని కొనియాడారు. జర్నలిజం రంగంలో రామోజీరావు అందించిన సేవలు చిరస్మరణీయమని, ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా పత్రికను ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలబెట్టారని ప్రశంసించారు. మారుతున్న కాలానికి, సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా తన సంస్థలను అభివృద్ధి చేయడం ఆయన ప్రత్యేకత అని పేర్కొన్నారు. రామోజీరావును రామ్‌నాథ్ గోయెంకా వంటి ప్రముఖ పాత్రికేయులతో - మిగతా 2లో



తుపానుపై అప్రమత్తం



- ముందస్తు జాగ్రత్తలపై సీఎం చంద్రబాబు ఆదేశాలు
- కోస్తాంధ్ర తీరానికి భారీ వర్ష సూచన
- ఈ నెల 20న కోస్తాంధ్రను తాకనున్న తుఫాను

అమరావతి, మహానగర్

ఈ నెల 20న కోస్తాంధ్ర తీరాన్ని తాకే అవకాశం ఉన్న తుఫాను నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో కేంద్రీకృతమై ఉన్న తీవ్ర వాయుగుండం మరింత బలపడి సోమవారం సాయంత్రానికి తుఫానుగా మారే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి - మిగతా 2లో



ఎస్ఐఆర్‌పై ఈసీని నిలదీసేందుకు అనుమతించండి!

- సుప్రీంకోర్టును ఆశ్రయించిన రాహుల్‌గాంధీ సహా విపక్ష నేతలు
- 48 ప్రశ్నలతో ప్రశ్నావళి సమర్పణ
- ఓటర్ల తొలగింపు, ఈసీ నిర్ణయాలపై వివరణ కోరిన నేతలు 5
- ఈ నెల 17న మరోసారి విచారణ

ఏపీలో రెండో విడత పంచాయతీ

ఎన్నికల షెడ్యూల్ విడుదల

- ఈ నెల 29న పోలింగ్.. అదే రోజు ఓట్ల లెక్కింపు
- 18 నుంచి 20 వరకు నామినేషన్ల స్వీకరణ
- 24న అభ్యర్థుల తుది జాబితా ప్రకటన
- మూడు దశల్లో 13,171 పంచాయతీలకు ఎన్నికలు
- స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో గ్రామాల వారీగా షెడ్యూల్ వివరాలు



అమరావతి, మహానగర్

ఆంధ్రప్రదేశ్‌లో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈ నెల 29న పోలింగ్ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. నవంబర్ 18 నుంచి 20 వరకు నామినేషన్ల స్వీకరణ, 21న నామినేషన్ల పరిశీలన చేపట్టనున్నారు. నవంబర్ 24 మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పించారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. నవంబర్ 29న ఉదయం 7 గంటల నుంచి - మిగతా 2లో

మున్సిపల్ ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రకటన!



మేయర్, చైర్మన్ అభ్యర్థుల జాబితా విడుదల

జగన్ ఆదేశాలతో 17 స్థానాలకు అభ్యర్థుల ఖరారు

తాడేపల్లి

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి మొదలైంది. మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను ప్రకటించింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పలు కార్పొరేషన్లకు మేయర్ అభ్యర్థులను, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు చైర్మన్, చైర్‌పర్సన్ అభ్యర్థులను ఖరారు చేసింది. మొత్తం 17 స్థానాలకు అభ్యర్థుల పేర్లను వెల్లడించింది.

కార్పొరేషన్ల మేయర్ అభ్యర్థులు

శ్రీకాకుళం: గుండ లక్ష్మీదేవి, కాకినాడ: కద సత్యశ్రీ, రాజమహేంద్రవరం: డి. వెంకట్రావు, మంగళగిరి--తాడేపల్లి: పి. నాయక్, మున్సిపాలిటీల చైర్మన్ అభ్యర్థులు, ఆముదాలవలస: అజంతాకుమారి, రాజాం: పాలవలస పద్మావతి, పాలకొల్లు: ఉమాశైలజ, తాడేపల్లిగూడెం: జి. శ్రీనివాస్, తణుకు: బలరామకృష్ణ, గుడివాడ: ఎం. ప్రవీణ, వైఎస్సార్ తాడిగడప: - మిగతా 2లో

యాక్ట్ ఈస్ట్ పాలసీకి ప్రాధాన్యం



- ఆసియాన్ సదస్సులో పాల్గొనేందుకు మనీలాకు ప్రధాని
- భారత్-ఆసియాన్ సంబంధాల బలోపేతమే లక్ష్యం..
- నేడు రెండు అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొననున్న మోదీ
- మనీలాలో ప్రధాని మోదీకు ఘన స్వాగతం 5

ర్యాలీల హోరు.. నామినేషన్ల జోరు!



తాడేపల్లి: ఆంధ్రప్రదేశ్‌లో రెండో విడత పురపోరుకు నామినేషన్ల పర్వం ముగిసింది. చివరి రోజైన సోమవారం అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామపత్రాలు దాఖలు చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీలుగా నామినేషన్ కేంద్రాలకు చేరుకుని తమ బలాన్ని చాటుకునే ప్రయత్నం చేశారు. వివిధ మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలో అభ్యర్థుల ర్యాలీలతో సందడి వాతావరణం నెలకొంది.

తాడేపల్లి మేయర్ అభ్యర్థిగా ఏడుకొండలు

మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా కూటమి తరఫున తెలుగుదేశం నేత పేరం ఏడుకొండలు నామినేషన్ దాఖలు చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేట మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా టీడీపీ నుంచి నాగసరపు రూపేష్ గుప్తా నామపత్రం సమర్పించగా, వైఎస్సార్‌సీపీ తరఫున షేక్ ఖాజావలి బరిలో నిలిచారు. విజయనగరం జిల్లా రాజాం మున్సిపల్ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా జనసేన తరఫున బనిశెట్టి సౌజన్యలత నామినేషన్ వేశారు. కృష్ణా జిల్లా గుడివాడ మున్సిపాలిటీలో చివరి రోజు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ ఛైర్‌పర్సన్ అభ్యర్థి మరిదు కరుణ ర్యాలీగా వెళ్లి నామపత్రాలు సమర్పించారు. మరోవైపు, అనుమతులు లేవంటూ వైఎస్సార్‌సీపీ ఛైర్‌పర్సన్ అభ్యర్థి మెరుగుమాల ప్రవీణ ర్యాలీని పోలీసులు అడ్డుకుని, మరో మార్గంలో వెళ్లాలని సూచించారు.

భారీ ర్యాలీలతో అభ్యర్థుల సందడి

గుంటూరు జిల్లా పొన్నూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో టీడీపీ, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు భారీ ర్యాలీలతో వచ్చి నామినేషన్లు దాఖలు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ స్థానానికి టీడీపీ తరఫున బసవ వీరవెంకట సత్యరామకృష్ణారావు, వైఎస్సార్‌సీపీ నుంచి ఇండుగపల్లి బలరామకృష్ణ, కాంగ్రెస్ తరఫున కడలి రామారావు నామపత్రాలు సమర్పించారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా టీడీపీ తరఫున ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి ప్రమీల నామినేషన్ దాఖలు చేశారు. వైఎస్సార్‌సీపీ తరఫున బొడ్డేపల్లి అజంతా కుమారి నామపత్రం సమర్పించారు.

బ్యాలెట్ పత్రంలో నోటా గుర్తు

స్థానిక సంస్థల ఎన్నికల్లో గుర్తుల కేటాయింపుపై రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, ఇతర రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన పార్టీలు, రిజిస్టరైన పార్టీలకు ఎన్నికల గుర్తుల కేటాయింపునకు సంబంధించి మార్గదర్శకాలను ప్రకటించింది. మేయర్, వార్డు సభ్యుల ఎన్నికల్లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు గతంలో కేటాయించిన గుర్తులే అమలులో ఉంటాయని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

సమీక్షలతో సరా... ప్రజల్లో భరోసా ఎప్పుడు

విజయవాడ

వైసీపీ భవిష్యత్తు మరియు వైఎస్ జగన్ నాయకత్వంపై రాజకీయ విశ్లేషకుల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ఆలస్యం చేస్తే పార్టీ మరింత బలహీనపడు తుందని కొందరు విశ్లేషకులు భావిస్తుండగా, క్షేత్రస్థాయిలో ఓటు బ్యాంకు పెరుగుతోందని వైసీపీ వర్గాలు వాదిస్తున్నాయి. వైసీపీ అధినేతగా జగన్ కార్యకర్తలకు, నేతలకు నిత్యం అందుబాటులో ఉండాల్సి ఉంది. నేతలకు నిరంతరం దిశానిర్దేశం చేస్తూ ఉండాలి. కేవలం ఎన్నికల సమయంలోనే కాకుండా, హెచ్చరికలతో సరిపెట్టకుండా తాను కూడా భాగస్వామి అవుతున్నానన్న ఆలోచన నేతల్లో కల్పించాలి. అంతే తప్ప నెలలో రెండు రోజులపాటు తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో సమీక్షలు జరపడం వల్ల ఒరిగేదేమీ లేదని అంటున్నారు. అదే జిల్లాలకు వచ్చి నేతలు, కార్యకర్తలతో సమావేశమైతే జగన్ తమ వద్దకు వస్తున్నారని, తప్పు చేస్తే మిగిలిన వారు ఫిర్యాదు చేస్తారన్న భయం నేతలలో ఉంటుందని అంటున్నారు. అలా చేయకుండా కేవలం నియోజకవర్గ ఇన్ ఛార్జులతోసమావేశమైతే ప్రయోజనం ఉండదని మరికొందరు సూచిస్తున్నారు. మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో ఓటమి తర్వాత క్యాడర్‌కు సరైన భరోసా ఇవ్వడంలో నాయకత్వం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. కార్యకర్తలు ఇంకా బయటకు రావడం లేదు. క్షేత్రస్థాయి నిర్మాణం లోనూ కొన్ని లోపాలు కనిపిస్తున్నాయని అంటున్నారు. పార్టీని తిరిగి పునర్నిర్మించాలంటే స్థానిక సమస్యలపై నిరంతర పోరాటం, బలమైన స్థానిక నాయకత్వం అవసరమని పలువురు సూచిస్తున్నారు. వచ్చే ఏడాది ఎటూ తాను పాదయాత్ర నిర్వహిస్తాను కదా? అని జగన్‌అనుకుంటే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుందని వైసీపీ అభిమానులు అంటున్నారు. పాదయాత్ర లో జగన్ అందరినీ కలవలేరు. అయితే జిల్లాలకు వెళ్లి సమీక్షలను నిర్వహించడం ద్వారా చాలా వరకూ ప్రయోజనం ఉంటుంది. అంతే తప్ప పాదయాత్ర తోనే అంతా సాధ్యమవుతుందని, అంతా సెట్ అవుతుందని భావిస్తే మళ్లీ బూమ్ రాంగ్ అయితే అది జగన్ తప్పిదమే అవుతుందని కొందరు వాదిస్తున్నారు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ ఓటు శాతం పెరిగిందని భావించడం ఒకరకంగా క్యాడర్ లోనూ, లీడర్లలోనూ ఆత్మవిశ్వాసాన్ని పెంచడం కోసమే తప్ప ఆ ఓటింగ్ శాతం సాధారణ ఎన్నికల వరకూ నిలబడే అవకాశం ఉండదు. ఎందుకంటే గతంలో జరిగిన పరిణామాలు ఇందుకు ఉదాహరణ. 2021 లో స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అద్భుతమైన విజయం సాధించినా, 2024 లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఓటమి పాలయిన విషయాన్ని కొందరు గుర్తు చేస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత మరియు అక్రమాల ఆరోపణలను అనుకూలంగా మలచుకోవాల్సి ఉంటుంది. అధికార కూటమి ప్రభుత్వ అక్రమాలు, దౌర్జన్యాలను తట్టుకుని తమ క్యాడర్ కసితో పోరాడిందని జగన్ జబ్బలు చరుచుకున్నా వారికి అవసరమైన సాయం అందించేలా పార్టీ ముందుకు రావాలన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. కార్యకర్తలకు అండగా నిలబడేలా "వైఎస్ జగన్ 2.0" తరహా నాయకత్వాన్ని అందిస్తానని జగన్ ప్రకటించారు. అలాగే స్థానిక ఎన్నికల్లో పనితీరు సరిగా లేని సుమారు 60 మంది నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లపై చర్యలు తీసుకునే అంశంపై ఆయన సీరియస్‌గా సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక ఎన్నికల ఫలితాల నేపథ్యంలో జగన్ తక్షణమే క్షేత్రస్థాయి మార్పులు చేసి కార్యకర్తల్లో ఉత్సాహం నింపకపోతే పార్టీకి ఇబ్బందులు పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తుండగా, ఓటు బ్యాంకు చెక్కుచెదరలేదని వైసీపీ అధిష్ఠానం ధీమా వ్యక్తం చేస్తోంది

ఇద్దరు మంత్రులు... ఏడుగురు ఎమ్మెల్యేలు హిట్ లిస్ట్...

విజయనగరం

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు కొందరు మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై అసంతృప్తిగా ఉన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో దాదాపు నలుగురు మంత్రులు, పదిహేడు మంది ఎమ్మెల్యేల పనితీరు సక్రమంగా లేదని గుర్తించిన చంద్రబాబు వారికి తొలుత క్లాస్ పీకాలని నిర్ణయించారు. ఇందులో ఉత్తరాంధ్ర జిల్లాకు చెందిన మంత్రి కూడా ఒకరున్నారు. అలాగే ఎమ్మెల్యేలు కూటమి ధర్మాన్ని పాటించకపోవడంతో పాటు రెబల్స్ ను రంగంలోకి పరోక్షంగా దించి వారికి సాయం అందించడం, కూటమి పార్టీల మధ్య సమన్వయం లేకపోవడం వల్లనే స్థానిక సంస్థల ఎన్నికల్లో కొన్ని చోట్ల ఓటమి పాలయ్యామని చంద్రబాబు బలంగా భావిస్తున్నారు. అయితే ఎమ్మెల్యేలకు క్లాస్ పీకడం మొదటి దశలో చేస్తారంటున్నారు. మంత్రుల విషయంలో అయితే త్వరలోజరగనున్న విస్తరణలో వారికి ఉద్వాసన పలకడం వంటివి చేస్తారంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాని నియోజకవర్గాలపై టీడీపీ అధిష్ఠానం సమీక్ష చేపట్టింది. ముఖ్యంగా ఉత్తరాంధ్రకు చెందిన ఇద్దరు మంత్రులు, ఏడుగురు ఎమ్మెల్యేల పనితీరుపై చంద్రబాబు అసంతృప్తిగా ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపిక, కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపం, స్థానిక నేతల నిర్లక్ష్యమే పరాజయాలకు కారణమని పార్టీకి నివేదికలు అందినట్లు తెలుస్తోంది. మంత్రులుగా తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించలేకపోయారని, పెత్తనం చేస్తూ జిల్లాపై వ్యక్తిగతంగా పట్టు పెంచుకోవడం మీదనే దృష్టి పెట్టి ఎన్నికలను గాలికి వదిలేశారన్న అభిప్రాయంలో చంద్రబాబు ఉన్నారు. వీరి పట్ల కొంత సీరియస్ గానే ఉన్న చంద్రబాబు మంత్రులకు ఎన్నిసార్లు మంత్రి వర్గ సమావేశంలో క్లాస్ పీకినా ప్రయోజనం లేకపోయిందని అంటున్నారు. అలాగే పనితీరు బాగాలేని ఎమ్మెల్యేలను పలుమార్లు హెచ్చరించినప్పటికీ ప్రయోజనాలు లేకపోవడంతో ఇక చర్యలకు దిగకతప్పదని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. అయితే ఇప్పటికిప్పుడు చర్యలు తీసుకోకపోయినా ఈ ఫలితాల ప్రభావం ఆ ఎమ్మెల్యేలపై ఉంటుందని అంటున్నారు. అందుకే చంద్రబాబు విజయవాడలో జరిగిన మీడియా సమావేశంలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఎన్డీయే కూటమి ఘనవిజయం సాధించినప్పటికీ అనంతపురం జిల్లాలో కూటమి పనితీరు ఆశించిన స్థాయిలో లేదని అంగీకరించారు. అక్కడ ఎదురైన ఎదురుదెబ్బకు గల కారణాలను పరిశీలిస్తామని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేయడంతోనే ఈ సంకేతాలు ఇచ్చినట్లయింది. మంత్రివర్గ సమావేశంలో, స్థానిక సంస్థల ఎన్నికల విజయంతో అతివిశ్వాసానికి లోనుకావద్దని మంత్రులకు చంద్రబాబు సూచించారు. 2029 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా పాలనపై దృష్టి పెట్టాలని, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఆయన ఆదేశించారు. కానీ ప్రయోజనం లేకపోవడంతో కొంత అసంతృప్తితో చంద్రబాబు ఉన్నారు. వీరివల్ల పార్టీ శ్రేణుల మనోభావాలకు ఇబ్బందిగా మారిందని కూడా అన్నారు. కార్యకర్తలను కూడా కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడంపై చంద్రబాబు ఒకింత అసహనంతో ఉన్నారని తెలిసింది. వీరిపై ఎలాంటి చర్యలు తీసుకోకుంటే రానున్న కాలంలో పార్టీ మరింత గాడి తప్పుతుందేమోనన్న భావన వ్యక్తమవుతుంది. కొన్ని చోట్ల వైసీపీ నేతలతో చేతులు కలిపినట్లు తెలియడంతో మరింత సీరియస్ అయినట్లు తెలుస్తోంది. మొత్తం మీద చంద్రబాబు చర్యలకు సిద్ధమయ్యారని, అయితే ఎప్పుడన్నదే తేలాల్సి ఉంటుంది.

12 లక్షల కోట్ల పెట్టుబడుల లెక్కలు సరే

విశాఖపట్టణం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు విశాఖపట్నం వేదికగా విజయవంతంగా ముగిసింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమక్షంలో జరిగిన ఈ రెండు రోజుల అంతర్జాతీయ సదస్సులో సుమారు రూ. 12.14 లక్షల కోట్ల విలువైన 141 అవగాహన ఒప్పందాలు , 2.46 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుబడుల ప్రతిపాదనలు ఖరారయ్యాయని ప్రభుత్వం ప్రకటించింది. గతేడాది సదస్సులో కుదిరిన ఒప్పందాల కొనసాగింపుగా, ఈసారి కూడా గ్రీన్ ఎనర్జీ, స్పేస్ టెక్నాలజీ, ఏఐ, రక్షణ మరియు తయారీ రంగాల్లో పారిశ్రామికవేత్తలను ఆకర్షించడంలో కూటమి ప్రభుత్వం తన మార్క్ చూపించింది.అయితే, పెట్టుబడుల సదస్సుల్లో కుదిరే లక్షల కోట్ల ఒప్పందాలు ప్రకటించిన వెంటనే గ్రౌండింగ్ కావనేది ఆర్థిక రంగంలో అందరికీ తెలిసిన వాస్తవం. గణాంకాల పరంగా రూ. 12 లక్షల కోట్ల అంకెలు ఎంత ఆకర్షణీయంగా కనిపించినా, అందులో కనీసం సగం శాతం పెట్టుబడులు నిర్దిష్ట గడువులోపు వాస్తవ రూపం దాల్చి, ఫ్యాక్టరీలు వెలిసి, స్థానిక యువతకు ఉద్యోగాలు లభిస్తేనే అది నిజమైన విజయం . పారిశ్రామికంగా ఆంధ్రప్రదేశ్ అడుగు ముందుకు వేస్తోందనడానికి ఈ సదస్సులు, ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ వంటి విధానాలు నిదర్శనంగా నిలుస్తున్నప్పటికీ, కాగితాలపై ఉన్న ఒప్పందాలను క్షేత్రస్థాయిలో ఫలితాలుగా మార్చడం ప్రభుత్వానికి అసలైన సవాలు.ఇక అన్నింటికంటే ముఖ్యమైన ప్రశ్న?ఈ భారీ పెట్టుబడుల లెక్కలు, జీడీపీ గణాంకాలు అధికార కూటమికి రాజకీయంగా ఓట్లు తెచ్చిపెడతాయా? భారతీయ ఎన్నికల చరిత్రను పరిశీలిస్తే, స్థూల ఆర్థిక వ్యవస్థ పరుగులు, లక్షల కోట్ల కార్పొరేట్ ఒప్పందాలు సాధారణ ఓటరు నాడిని నేరుగా ప్రభావితం చేయలేవని స్పష్టమవుతోంది.

మూడు రాష్ట్రాల మధ్య రైల్వే లైన్

శ్రీకాకుళం

ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి ఏపీ మీదుగా తెలంగాణలోని భద్రాచలం, పాండురంగాపురం వరకు నిర్మించనున్న 173.61 కిలోమీటర్ల కొత్త రైల్వే లైన్‌కు పోలవరం జలాశయం ముంపు సమస్య ఎదురైంది. ఏపీలోని పోలవరం జిల్లా పరిధిలో 65 కిలోమీటర్ల మేర ప్రతిపాదిత మార్గం ముంపు ప్రాంతంలోకి వస్తున్నట్లు గుర్తించడంతో ఎలైన్‌మెంట్ మార్చేందుకు అధికారులు సర్వే చేస్తున్నారు. మార్గం మారితే కొత్త స్టేషన్లు, టన్నెల్స్ నిర్మించాల్సి రావడంతో రూ.2,864 కోట్ల ప్రాజెక్టు వ్యయం పెరిగే అవకాశముంది.ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం జిల్లా మీదుగా తెలంగాణలోని భద్రాచలం, పాండురంగాపురం వరకు నిర్మించనున్న కొత్త రైల్వే లైన్‌కు పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతం అడ్డంకిగా మారింది. ఈ మార్గంలోని సుమారు 65 కిలోమీటర్ల మేర రైల్వే లైన్ ముంపు పరిధిలో ఉన్నట్లు భూసేకరణ సమయంలో అధికారులు గుర్తించారు. దీంతో ప్రతిపాదిత రైల్వే మార్గం మార్చేందుకు రైల్వే శాఖ క్షేత్రస్థాయిలో మరోసారి సర్వే చేపట్టింది. ముంపు గ్రామాలకు ఎగువన అనువైన మార్గాన్ని గుర్తించే పనులు ప్రస్తుతం తుది దశకు చేరుకున్నాయి. సర్వే నివేదికను త్వరలో రైల్వే బోర్డుకు పంపించనున్నారు.మల్కన్‌గిరి నుంచి భద్రాచలం, పాండురంగాపురం వరకు 173.61 కిలోమీటర్ల పొడవున పూర్తిగా ఏజెన్సీ ప్రాంతాల మీదుగా కొత్త రైల్వే లైన్ నిర్మించేందుకు రైల్వే శాఖ ఇటీవల ఆమోదం తెలిపింది. ఈ మార్గంలో ఒడిశాలోని మల్కన్‌గిరితోపాటు బడలి, పనిమట, రాజన్‌గూడ, లచ్చిపేట, కందపల్లి, మోటు ప్రాంతాల్లో స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు.

వచ్చే పదేళ్లలో అగ్రగామిగా ఏపీ

-మొదటిపేజీ తరువాయి

పోల్చవచ్చని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు యుద్ధాలు, ఆర్థిక సంక్షోభాలతో సతమతమవుతున్నప్పటికీ భారత్ వేగంగా ఆర్థిక ప్రగతి సాధిస్తోందని అమిత్ షా తెలిపారు. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం గత 12 ఏళ్లలో 50 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై మాట్లాడుతూ రెవెన్యూ లోటు ఉన్న రాష్ట్రంలోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధిని తిరిగి పట్టాలెక్కించారని ప్రశంసించారు. విశాఖపట్నంలో గూగుల్ సంస్థ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో చేపట్టనున్న డేటా సెంటర్ ప్రాజెక్టు దేశ డిజిటల్ రంగానికి కీలకంగా మారుతుందని తెలిపారు. అమెరికా వెలుపల గూగుల్ ఏర్పాటు చేయనున్న తొలి డేటా సెంటర్ ప్రాజెక్టుగా దీనికి ప్రాధాన్యత ఉందన్నారు. విశాఖ తీరంలో సముద్రగర్భం నుంచి ఏర్పాటు చేస్తున్న సబ్‌సీ కేబుల్, రాష్ట్రానికి రానున్న సెమీకండక్టర్ యూనిట్, స్టీల్ ఫ్యాక్టరీలు, అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం వంటి ప్రాజెక్టులు ఏపీ అభివృద్ధికి దోహదపడతాయని పేర్కొన్నారు. చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం రెండున్నరేళ్లలో రాష్ట్రానికి రూ.30 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చిందని తెలిపారు. గతంలో నిలిచిపోయిన పోలవరం ప్రాజెక్టును తిరిగి ముందుకు తీసుకెళ్లి రైతులకు, ప్రజలకు నీరందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ విలువల కోసం జీవితాంతం రాజీలేని పోరాటం చేసిన మహనీయుడు రామోజీరావు అని, ఆయన తెలుగుజాతి కీర్తి, తరతరాలకు స్ఫూర్తి అని కొనియాడారు. ఈనాడు, మార్గదర్శి, ఈటీవీ వంటి సంస్థలను స్థాపించి తెలుగు సమాజానికి విలువైన ఆస్తులుగా అందించారని పేర్కొన్నారు. రామోజీరావు జయంతిని రాష్ట్ర కార్యక్రమంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ప్రతి సంవత్సరం ఈ వేడుకలు నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. ప్రజా సమస్యలపై స్పందించడంతో పాటు ప్రకృతి విపత్తుల సమయంలో ఈనాడు సంస్థ ప్రజలకు అండగా నిలిచిందని గుర్తుచేశారు. అమరావతి రాజధాని పేరును నిర్ణయించే సమయంలో రామోజీరావు లోతుగా అధ్యయనం చేసి ఆ పేరును సూచించారని, రాజధాని నిర్మాణానికి రూ.10 కోట్లు, కరోనా సమయంలో రాష్ట్రానికి మరో రూ.10 కోట్లు విరాళంగా అందించారని తెలిపారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా విలువల విషయంలో రాజీ పడకుండా నిలిచిన వ్యక్తి రామోజీరావు అని అన్నారు. కార్యక్రమంలో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు శ్రీనివాసవర్మ, కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జర్నలిజం, కళలు–సంస్కృతి, గ్రామీణాభివృద్ధి–వ్యవసాయం, మహిళా సాధికారత, సైన్స్–టెక్నాలజీ, యూత్ ఐకాన్, సామాజిక సేవ, విద్య, వైద్య రంగాల్లో విశిష్ట సేవలందించిన తొమ్మిది మందికి రామోజీ ఎక్సలెన్స్ అవార్డులను అమిత్ షా, చంద్రబాబు, పవన్ కల్యాణ్, గవర్నర్ ప్రదానం చేసి అభినందించారు. కార్యక్రమంలో రామోజీ గ్రూప్ సీఎండీ సీహెచ్ కిరణ్, రామోజీరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తుపానుపై అప్రమత్తం



-మొదటిపేజీ తరువాయి

వివరించారు. ఈ నేపథ్యంలో సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వాయుగుండం పరిస్థితిపై సీఎం సమీక్ష నిర్వహించారు. తుఫాను కదలికలను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. కేంద్ర బృందం చేసిన సిఫార్సులను పరిగణనలోకి తీసుకుని క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. తుఫాను ప్రభావంతో ఈ నెల 19, 20 తేదీల్లో కోస్తాంధ్ర తీర ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గతంలో ఆర్నబ్ తుఫాను తరహాలోనే దీని ప్రభావం ఉండవచ్చని అంచనా వేశారు. కోనసీమ, కాకినాడ, తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాలపై తుఫాను ప్రభావం ఉండే అవకాశం ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే ప్రభావిత ప్రాంతాలకు పంపించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించేందుకు సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ముఖ్యమంత్రి సూచించారు. భారీ వర్షాల కారణంగా వచ్చే వరద ప్రవాహాలను రిజర్వాయర్లకు మళ్లించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

మున్సిపల్ ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రకటన!



-మొదటిపేజీ తరువాయి

బి. వీరబాబు, నరసరావుపేట: షేక్ ఖాజావలి, పొన్నూరు: నాసర్, బాపట్ల: కె. సుధీర్‌బాబు, కావలి: కె. శివకుమార్‌రెడ్డి, చింతలపూడి: పి. సునీత

ఎన్నికలపై పార్టీ దృష్టి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బలమైన పోటీ ఇవ్వాలనే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ ముందస్తుగానే అభ్యర్థులను ప్రకటించినట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. అభ్యర్థుల ఎంపిక ద్వారా ఆయా ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారానికి సిద్ధమయ్యే అవకాశం కల్పించింది. స్థానిక నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల బరిలోకి దిగేందుకు పార్టీ వ్యూహరచన చేస్తోంది.

రాజకీయంగా కీలకంగా మారిన ప్రకటన

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలపై దృష్టి సారిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ప్రకటనతో ఆయా పట్టణాల్లో రాజకీయ సందడి మొదలైంది. ఇతర పార్టీలు తమ అభ్యర్థులను ఎప్పుడు ప్రకటిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది.

హిమాలయ నుంచి ఎక్స్‌ట్రా మాయిశ్చరైజింగ్ బేబీ సోప్



విశాఖపట్నం, మహానగర్

శిశువుల సున్నితమైన, పొడి చర్మ సంరక్షణ కోసం హిమాలయ బేబీకేర్ తన 'ఎక్స్‌ట్రా మాయిశ్చరైజింగ్ బేబీ సోప్'పై నూతన ప్రచారాన్ని ప్రారంభించింది. ముఖ్యంగా చలికాలంలో శిశువుల చర్మం పొడిబారకుండా తేమను అందించేందుకు ఈ సబ్బును రూపొందించినట్లు సంస్థ తెలిపింది. కలబంద, పాల సుగుణాలతో కూడిన 'అలో--మిల్క్ మాయిశ్చర్ కాంప్లెక్స్' చర్మానికి తేమను అందించడంలో సహాయపడుతుందని పేర్కొంది. వైద్యపరంగా పరీక్షించిన ఈ సబ్బులో కృత్రిమ రంగులు, పారాబెన్లు, థాలేట్లు ఉండవని వెల్లడించింది. హిమాలయ వెల్‌నెస్ కంపెనీ బేబీకేర్ విభాగం డైరెక్టర్ ఎన్.వి. చక్రవర్తి మాట్లాడుతూ శిశువుల ఆరోగ్యం, సౌకర్యానికి అనుగుణంగా సురక్షితమైన, సున్నితమైన ఉత్పత్తులను అందించేందుకు సంస్థ కట్టుబడి ఉందన్నారు. ఆయుర్వేద విజ్ఞానం, మూలికల పరిశోధనల ఆధారంగా ఉత్పత్తులను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు.

తాడిగడప 28వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా గుమ్మడి జస్లీన్ నామినేషన్

పెనమలూరు, మహానగర్



తాడిగడప పురపాలక సంఘం 28వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థినిగా గుమ్మడి జస్లీన్ యనమలకుదురు గ్రామ సచివాలయంలో సోమవారం నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. ప్రముఖ రంగస్థల నటుడు గుమ్మడి జైరాజు మనుమడి భార్య అయిన జస్లీన్ రాజకీయ నేపథ్యం కలిగిన కుటుంబానికి చెందినవారు. గ్రామంలో ఆమెకు ఉన్న పరిచయాలు, ప్రజలతో అనుబంధం నేపథ్యంలో ఈ ఎన్నికల్లో ఆమె అభ్యర్థిత్వంపై స్థానికంగా చర్చ జరుగుతోంది.

పుస్తక పఠనంతో విజ్ఞానం



ఆగిరిపల్లి, మహానగర్

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ శాఖ, ఉమ్మడి కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో 9వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 'నాకు నచ్చిన పుస్తకం' అనే అంశంపై నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు తాము చదివిన పుస్తకాలు, అవి తమ జీవితాలపై చూపిన ప్రభావాన్ని వివరిస్తూ చక్కగా వ్యాసాలు రాశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఈ.జి.ఎస్.వి. కుమార్, పల్లగాని రాంబాబు సరస్వతీ విద్యాలయం ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు పి. మానస, గ్రంథాలయ పాఠకుడు మల్లవెల్లి రాంబాబు, గ్రామ పెద్దలు, పాఠకులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. పుస్తక పఠనం వల్ల విజ్ఞానంతో పాటు మంచి ఆలోచనలు, విలువలు పెంపొందుతాయని పేర్కొంటూ, ప్రతి విద్యార్థి ప్రతిరోజూ కొంత సమయం గ్రంథాలయంలో గడిపి పుస్తకాలు చదవాలని సూచించారు.

మెరుగైన వైద్యం కోసం ఎల్ఓసీ పత్రాలు అందజేత

ఎమ్మెల్యే సుజనా చౌదరి సహకారంతో నలుగురికి
రూ.27.13 లక్షల వైద్య సాయం

విజయవాడ, మహానగర్



అనారోగ్యం, ప్రమాదాల కారణంగా అత్యవసర వైద్యం అవసరమైన నలుగురికి ఎమ్మెల్యే సుజనా చౌదరి సహకారంతో మొత్తం రూ.27.13 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) పత్రాలు మంజూరయ్యాయి. ఈ పత్రాలను భవానిపురంలోని ఎన్డీయే కార్యాలయంలో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కూటమి నాయకులతో కలిసి బాధిత కుటుంబాలకు సోమవారం అందజేశారు. కొత్తపేటకు చెందిన కోలా వెంకటేశ్వరరావు (42) రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో అత్యవసర చికిత్స నిమిత్తం రూ.10 లక్షలు, భవానిపురానికి చెందిన చీదెళ్ల హేమసుందరరావు (58) బ్రెయిన్ స్ట్రోక్‌కు గురికావడంతో రూ.7.98 లక్షలు, ఊర్మిళ నగర్‌కు చెందిన మూలకా ఆది రెడ్డి (55) భవనం పైనుంచి పడి గాయపడటంతో రూ.6.35 లక్షలు, ప్రైజర్‌పేటకు చెందిన కలకోటి నాగలక్ష్మి (28) తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతుండటంతో వైద్య చికిత్స కోసం రూ.2.80 లక్షల ఎల్ఓసీ పత్రాలు మంజూరయ్యాయి. అత్యవసర వైద్య అవసరాలపై ఎమ్మెల్యే సుజనా చౌదరి త్వరితగతిన స్పందించి ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 47వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ ఈగల సాంబశివరావు, 40వ డివిజన్ జనసేన పార్టీ అధ్యక్షుడు బొల్లేపల్లి కోటేశ్వరరావు, బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షర్మిల, మహంతిపురం బీజేపీ మండల అధ్యక్షురాలు పగిడిపల్లి రాజేశ్వరి, టీడీపీ నాయకులు నల్లిబెల్లి కనకరావు, ముదిరి శ్రీను, దుర్గా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా సన్ వన్ గ్రామ్ గోల్డ్ జ్యూవెలరీ షోరూమ్ ప్రారంభోత్సవం





కర్నూలు, మహానగర్

నగ్రోని జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన సన్ వన్ గ్రామ్ గోల్డ్ జ్యూవెలరీ షోరూమ్ ప్రారంభోత్సవం సోమవారం సినీ తారలు, మోడల్స్ సందడితో అట్టహాసంగా జరిగింది. ప్రముఖ సినీ హీరోయిన్లు ప్రియాంక శర్మ, మేఘా బెనర్జీ, మోడల్స్ ప్రతిమ మౌర్య, భావన ముఖ్య అతిథులుగా పాల్గొని షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రియాంక శర్మ, మేఘా బెనర్జీ మాట్లాడుతూ కర్నూలు నగరానికి రావడం తొలిసారి అని, స్థానిక ప్రజలు తమకు ఆత్మీయ స్వాగతం పలికారని తెలిపారు. నగరం అభివృద్ధి చెందుతున్న తీరును ప్రశంసించారు. బంగారు ఆభరణాల ధరలు సామాన్యులకు భారంగా మారుతున్న నేపథ్యంలో ఆధునిక డిజైన్లతో, అందుబాటు ధరల్లో వన్ గ్రామ్ గోల్డ్ జ్యూవెలరీని అందిస్తున్న సన్ వన్ గ్రామ్ ప్రయత్నం అభినందనీయమని పేర్కొన్నారు. మోడల్స్ ప్రతిమ మౌర్య, భావన మాట్లాడుతూ మహిళలు ఆభరణాలను ఇష్టపడతారని, విభిన్న డిజైన్లతో కూడిన వన్ గ్రామ్ జ్యూవెలరీ కలెక్షన్లు కర్నూలు ప్రజల ఆదరణ పొందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సంస్థ దేశవ్యాప్తంగా మరిన్ని శాఖలతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. గత రెండు దశాబ్దాలుగా వినియోగదారుల ఆదరణ పొందుతున్న తమ సంస్థ, మారుతున్న అభిరుచులకు అనుగుణంగా నూతన డిజైన్లు, ఆకర్షణీయమైన వన్ గ్రామ్ గోల్డ్ జ్యూవెలరీతో పాటు వెండి ఆభరణాలను కూడా అందుబాటులోకి తీసుకురావడమే కొత్త షోరూమ్ లక్ష్యమని మేనేజింగ్ డైరెక్టర్ ఆర్. సిద్ధార్థన్, డైరెక్టర్ ఉమా మహేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నిర్మాత పాకలపాటి విజయ వర్మ, ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు చైతన్య జంగా, వ్యాపారవేత్తలు ఉదయ్, మహేష్ తదితరులు పాల్గొని నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీ కనకదుర్గమ్మకు బంగారు కానుకలు



ఇంద్రకీలాద్రి, మహానగర్



శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి భక్తులు మొత్తం 359.800 గ్రాముల బంగారు ఆభరణాలను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. విజయవాడ వన్‌టౌన్‌కు చెందిన సీహెచ్.ఎల్.జి. ప్రసూనాంబ, సీహెచ్.జి.ఎస్.వి. ప్రసాద్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దేవస్థాన కార్యాలయానికి విచ్చేసి అమ్మవారి మూలవిరాట్ అలంకరణ నిమిత్తం 192.500 గ్రాముల బంగారు కాసుల పేరు, 104.300 గ్రాముల బంగారు సూత్రాలు, గొలుసులను మొత్తం 296.800 గ్రాముల ఆభరణాలను దేవస్థానం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఈవో శీనా నాయక్ సమక్షంలో అందజేశారు. అదేవిధంగా కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన శిరీష అదే రోజు ఉదయం 63 గ్రాముల బంగారు హారాన్ని అమ్మవారి అలంకరణ నిమిత్తం చైర్మన్‌కు సమర్పించారు. స్థానాచార్య శివ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అధికారులు నిబంధనల ప్రకారం ఆభరణాలను స్వీకరించి దాతలకు రసీదులు అందజేశారు. అనంతరం దాతల కుటుంబాలకు అమ్మవారి ప్రత్యేక దర్శనం కల్పించి, వేద ఆశీర్వచనం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.





దొంగలను పట్టించిన సీసీ కెమెరాలు.

డిక్కీలో నగదు చోరీ కేసును ఛేదించిన పోలీసులు.. రూ.4.62 లక్షల నగదు స్వాధీనం





జగ్గయ్యపేట, మహానగర్

వాహనం డిక్కీలో నగదు చోరీ చేసిన కేసును జగ్గయ్యపేట పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ, సాంకేతిక ఆధారాలతో ఛేదించి, చోరీకి గురైన రూ.4,62,590 నగదును పూర్తిగా స్వాధీనం చేసుకున్నారు. అక్టోబర్ 30న జగ్గయ్యపేట చిల్లకల్లు రోడ్డులో బాధితుడు తన స్కూటర్ సీటు కింద ఉంచిన నగదును ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదుతో జగ్గయ్యపేట ఎస్ఐ కేసు నమోదు చేయగా, నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు ఆదేశాల మేరకు రూరల్ డీసీపీ బి. లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి. వెంకటేశ్వర్లు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలంలోని సీసీ కెమెరాల ఫుటేజీ, సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించి వారి కదలికలపై నిఘా ఏర్పాటు చేశారు. పక్కా సమాచారంతో నిందితుల్లో ఒకరైన తెలంగాణ రాష్ట్రం మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడెం మండలం ఊట్లై గ్రామానికి చెందిన మేకల ప్రకాష్ (37)ను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి చోరీకి గురైన మొత్తం రూ.4,62,590 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరో నిందితుడు మేకల రాజేష్ పరారీలో ఉండగా, అతని కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. విచారణలో నిందితులు మహారాష్ట్రలోనూ ఇదే తరహా నేరాలకు పాల్పడి పలుమార్లు జైలు శిక్ష అనుభవించినట్లు వెల్లడైంది. భారీ మొత్తంలో నగదును తీసుకెళ్లేటప్పుడు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యాపార సంస్థలు, బ్యాంకుల వద్ద సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూసుకోవాలని పోలీసులు సూచించారు. కేసును వేగంగా ఛేదించి చోరీ సొత్తును పూర్తిగా రికవరీ చేసిన ఇన్‌స్పెక్టర్ పి. వెంకటేశ్వర్లు, జగ్గయ్యపేట ఎస్ఐ జి. రాజు, పెనుగంచిప్రోలు ఎస్ఐ ఎం.ఎస్.కె. అర్జున్, సిబ్బందిని పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖర బాబు ప్రత్యేకంగా అభినందించారు.

బ్యూరోక్రసిలో పాలిటిక్స్ ఇంతింతకాదయా

సాధారణ రాజకీయాల్లో జరిగే ఎత్తులు, పైఎత్తులు బహిరంగంగానే కనిపిస్తాయి. కానీ బ్యూరోక్రసీ సర్కిల్‌లో సాగే రాజకీయాలు అంతకంటే ఎన్నో రెట్లు షార్ప్ గా ఉంటాయి. రాజకీయ నేతలు కూడా అలాంటి వ్యూహాలు పన్నరు. పైకి అత్యంత క్రమశిక్షణతో, నిబంధనల చట్రంలో కనిపించే అధికార యంత్రాంగంలో లోపల మాత్రం నిరంతరం ఒక అండర్ కరెంట్ ప్రవహిస్తూ ఉంటుంది. ఇక్కడ బహిరంగ విమర్శలు ఉండవు, నినాదాలు వినిపించవు కేవలం ఫైళ్ల కదలికలు, ఆమోద ముద్రలు, నిశ్శబ్ద బదిలీల రూపంలోనే ఆధిపత్య పోరు జరుగుతుంది. సాధారణ రాజకీయ నాయకులకంటే ఎక్కువ మేధస్సు, వ్యవస్థపై పూర్తి పట్టు ఉన్న వ్యక్తుల మధ్య సాగే ఈ చదరంగంలో, ఏ అడుగు ఎటువైపు పడుతుందో అంచనా వేయడం సామాన్యులకు సాధ్యం కాదు.ఈ అధికారిక వలయంలో ఒక అధికారికి వచ్చే ప్రజాదరణ ఒక్కోసారి ఆయనకే పెద్ద శాపంగా మారుతుంది. ప్రజల్లో మంచి పేరు తెచ్చుకోవడం, మీడియాలో హైలైట్ అవ్వడం , తన పరిధిలో స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడం వంటివి తోటి అధికారుల్లోనూ, పైస్థాయి బాస్‌లలోనూ అసూయను, అభద్రతాభావాన్ని రగిలిస్తాయి. వ్యవస్థ కంటే వ్యక్తి పెద్దవాడు కాకూడదు అనే పాయింట్ బ్యూరోక్రసీలో బలంగా పనిచేస్తుంది. ఫలితంగా, అసాధారణ ప్రతిభ కనబరిచే అధికారులు, తమ పనితీరుతో ప్రజల మన్ననలు పొందేవారు సహజంగానే అంతర్గత రాజకీయాలకు ప్రధాన లక్ష్యంగా మారిపోతుంటారు.మరోవైపు, అధికారంలో ఉన్న రాజకీయ నాయకులతో వ్యక్తిగత సాన్నిహిత్యం పెంచుకోవడం, పై అధికారులను బైపాస్ చేసి నేరుగా ముఖ్యమంత్రులు లేదా మంత్రులతో వ్యవహారాలు నడపడం తక్షణ ప్రయోజనాలను ఇవ్వొచ్చు. కానీ, ఈ షార్ట్ కట్ మార్గం దీర్ఘకాలంలో అత్యంత ప్రమాదకరంగా మారుతుంది. అధికార మార్పిడి జరిగినప్పుడో, లేదా ఆ రాజకీయ నాయకుడి ప్రాధాన్యత తగ్గినప్పుడో సదరు అధికారి పూర్తిగా ఏకాకి అవుతారు. అప్పటివరకు తాను విస్మరించిన పై అధికారుల ఆగ్రహానికి గురికావడమే కాకుండా, కొత్త ప్రభుత్వంలో పాత ప్రభుత్వ మనిషి అనే ముద్ర పడి ప్రాధాన్యత లేని పోస్టులకు పరిమితం కావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. బదిలీలు, పదోన్నతులు మరియు కీలక పోస్టింగ్‌ల విషయంలో రాజకీయ నాయకులు జోక్యం చేసుకోవడం వల్ల అధికారులు కొన్ని రాజకీయ పక్షాలకు అనుకూలంగా మారే అవకాశం ఉంటుంది. విభాగాల మధ్య సమన్వయ లోపం ఏర్పడటం, ఫైళ్ల క్లియరెన్స్‌లో జాప్యం జరగడం, మరియు ప్రజా ప్రయోజనాల కంటే వ్యక్తిగత లేదా విభాగ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి సమస్యలు తలెత్తుతాయి. సానుకూల ప్రభావాలు: వివిధ విభాగాల మధ్య జరిగే చర్చలు మరియు భిన్నాభిప్రాయాల వల్ల ఏకపక్ష నిర్ణయాలకు అడ్డుకట్ట పడుతుంది. అన్ని కోణాలను పరిశీలించిన తర్వాతే విధానాలు అమలవుతాయి.విధానపరమైన ఘర్షణలు: ప్రజాప్రతినిధులు తక్షణ ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకోవాలని చూస్తే, అధికారులు నిబంధనలు మరియు దీర్ఘకాలిక పరిణామాలను దృష్టిలో ఉంచుకుని వాటిని వ్యతిరేకించవచ్చు. సివిల్ సర్వీస్ అధికారుల మధ్య కూడా బ్యాచ్‌ల వారీగా (యాచింగ్), కేడర్ వారీగా లేదా భావజాలం ఆధారంగా అంతర్గత వర్గాలు ఏర్పడతాయి. ఒక వర్గానికి చెందిన అధికారికి ప్రాధాన్యత దక్కితే, మరొక వర్గం వ్యతిరేక వ్యూహాలు రచిస్తుంది. మంత్రులు వర్సెస్ అధికారులు: రాజకీయ నాయకులకు (మంత్రులకు), బ్యూరోక్రాట్లకు మధ్య నడిచే ఆధిపత్య పోరు నిత్యసత్యం. నిర్ణయాలు ఎవరి పేరుతో వెళ్లాలి, క్రెడిట్ ఎవరికి దక్కాలి అనే విషయంలో తెరవెనుక పెద్ద తతంగం నడుస్తుంది. సలహాల ద్వారా ప్రభావితం చేయడం: పాలసీల రూపకల్పనలో మంత్రులకు ఏది కావాలంటే అది అందించడం కంటే, తమకు ఇష్టమైన పాలసీ వైపు రాజకీయ నాయకులను మళ్లించడానికి అధికారులు వ్యూహాత్మకంగా నోట్స్ సిద్ధం చేస్తుంటారు. బ్యూరోక్రసీలో అతిగా మెరిసినా, అతిగా రాజకీయాలకు దగ్గరైనా అందుకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.వ్యవస్థలోని నిబంధనలను, సీనియారిటీ మర్యాదలను గౌరవిస్తూ, తెరవెనుక ఉండి పనిచేసేవారే ఇక్కడ సుదీర్ఘకాలం మనుగడ సాగించగలరు. స్వతంత్ర నిర్ణయాల పేరిట హద్దులు దాటినా, రాజకీయ అండదండలతో పైవారిని ధిక్కరించినా, కాలం మారినప్పుడు ఆ అధికారికి రక్షణ కవచం ఉండదు. అందుకే, పరిపాలనా దక్షతతో పాటు ఈ అంతర్గత రాజకీయాల సమీకరణాలను అర్థం చేసుకోవడమే సివిల్ సర్వీసెస్‌లో అసలైన అగ్నిపరీక్ష!

అమెరికా ఎన్నికల్లో సాంస్కృతిక పోరాటాల్లేవ్ !



అమెరికాలో జరిగిన మధ్యంతర ఎన్నికలు 'తప్పులు సరిదిద్దుకోవటం'లో ప్రజాస్వామ్యానికున్న బలాన్ని చాటాయి. చాలామంది ఊహించినదానికంటే ఎక్కువ మార్పునే అమెరికా ఓటర్లు చూపారు. అధ్యక్షుడు తాననుకున్నది చేయటానికి కాంగ్రెస్‌లో మెజారిటీ కీలకం. లేదంటే విదేశీ విధానాల్లో, రక్షణ, దేశ భద్రత విషయాలలో తప్ప ఎగ్జిక్యూటివ్ ఆదేశాల ఫలితాలు పరిమితంగా ఉంటాయి. తాజా ఎన్నికల తర్వాత ప్రతినిధుల సభలో డెమోక్రాటిక్ పార్టీ భారీ మెజారిటీ సాధించింది. సెనేట్‌లోనూ దాని ఆధిక్యం గణనీయంగా పెరిగింది. అధ్యక్షుడి రెక్కలు కత్తిరించారు ప్రజలు. అటు ప్రతినిధుల సభ, ఇటు సెనెట్ రెండింటి లోనూ అధికార పార్టీకి భారీ వ్యతిరేకత వ్యక్తమవటం చాలా అరుదు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 1946, 1994, 2010లో మాత్రమే అలా జరిగింది. సరిహద్దుల్ని కట్టుదిట్టం చేసి, అక్రమ వలసల్ని ఆపుతారనే నమ్మకంతోనే ట్రంప్‌కి చాలామంది సంప్రదాయ డెమోక్రాట్ ఓటర్లు మద్దతిచ్చారు. కానీ దాన్ని క్రూరంగా, మానవ హక్కుల ఉల్లంఘనలా, ఆయా దేశాల్లో ఎన్నికైన ప్రభుత్వాధినేతల్ని అవమానించేలా మార్చి ట్రంప్ వ్యవహరించటం, వాచాలత్వాన్ని ప్రదర్శించటం అధిక శాతం అమెరికన్లకు ఆమోదయోగ్యం కాలేదు. అదేవిధంగా, ఇరాన్‌పై యుద్ధంతో అనుకున్న ప్రయోజనాలు నెరవేరకపోగా ఇంధన సంక్షోభాన్ని సృష్టించి, డీజిల్, గాసోలిన్ ధరలు పెరిగేట్టు చేసింది. అమెరికా విదేశాంగ విధానం ఆధారంగా ఆ దేశ ప్రజలు ఓటు వేయటం ప్రచ్ఛన్న యుద్ధకాలంలో కూడా అరుదు. కానీ, ఈసారి సుంకాలు, ఇరాన్ యుద్ధం పర్యవసానంగా స్థానికంగా ఇంధన ధరలు, ఇతర వ్యయాలు అధికమైనాయి. సగటు అమెరికన్లకు ఉపాధి అవకాశాలు పెరగకపోగా, వలసవిధానం అమలు తీరుతో రైతులు, చిన్నా పెద్దా సంస్థలు మానవ వనరులు దొరక్క ఇబ్బంది పడ్డాయి. వీటన్నింటికీ అధ్యక్షుడి అరాచక ధోరణే కారణమని ప్రజలు భావించారు. కంచుకోటల్లాంటి రాష్ట్రాల్లోనూ రిపబ్లికన్ పార్టీ ఓడింది. ఆఫ్రో అమెరికన్, లాటిన్ అమెరికన్ తొలిసారి గవర్నర్లుగా ఎన్నికయ్యారు. ఎనిమిది రాష్ట్రాల్లో రిపబ్లికన్‌లకు అనుకూలంగా 16 స్థానాలను ట్రంప్ పునర్విభజించినా కొత్త కాంగ్రెస్ సీట్లలో ప్రతి అయిదులో ఒకటి మాత్రమే రిపబ్లికన్లు గెలవగలిగారు. ప్రపంచ ప్రజాస్వామ్యానికి దిక్సూచిలాంటి తమ దేశం అప్రజాస్వామిక, భావోద్వేగ నిర్ణయాల బారిన పడటాన్ని సహించలేని అమెరికన్లు జాతి, మత, తెగ, వర్ణాలకు అతీతంగా ఏకమైనారు. తాము ఏ పార్టీకీ శాశ్వత ఓటర్లం కాదని, కొన్ని విలువలకి, తమ జీవితంలో బాగోగులకి అనుగుణంగా ఓటుని మార్చుకునే శక్తి ఉందని రుజువు చేశారు. ఇలా ఓటర్లు పార్టీ విధేయత కంటే విలువలు, ఉమ్మడి ప్రయోజనాలకి పెద్దపీట వెయ్యటం ప్రజాస్వామ్యం మనుగడకి, విజయానికి కీలకం. ఈ మధ్యంతర ఫలితాల తర్వాత రిపబ్లికన్ పార్టీ తిరిగి తన అంతర్గత ప్రజాస్వామ్యాన్ని సమీక్షించుకోవచ్చు. ట్రంప్ నీడ నుంచి పలువురు నేతలు బయటపడి ప్రజాస్వామ్యానికి కీలకమైన హేతుబద్ధతతో వ్యవహరించవచ్చు. ఈ ఎన్నికల్లో ఎటువంటి సాంస్కృతిక పోరాటాలూ లేవు. కేవలం అధ్యక్షుడి వ్యవహారశైలి వల్ల రోజువారీ జీవితంలో కష్టాలు పడుతున్నామన్న భావనే ప్రజల ఓటింగ్ సరళిని మార్చింది. టెక్సాస్, ఓహయో, జార్జియా లాంటి మితవాద రాష్ట్రాలన్నింటిలోనూ డెమోక్రాటిక్ పార్టీ ఘనవిజయం సాధించింది. ఫ్లోరిడాలో గవర్నరు ఎన్నికలో కేవలం 1.3శాతం ఓట్లతో డెమోక్రాట్లు ఓడారు. అమెరికన్ ప్రజల ఓటు డెమోక్రాటిక్ పార్టీలో వామపక్ష అతివాదులకు కాక, మధ్యేవాద, మితవాదులకి అనుకూలంగా పడింది. డెమోక్రాట్లు తమ పార్టీ బలాన్ని పెంచుకోవాలంటే ఈ మధ్యేవాద రాష్ట్రాలలో ప్రజలని ఆకట్టుకోవాలి. ఈ పరిస్థితి డెమోక్రాటిక్ పార్టీ భవిష్యత్తుకి, అమెరికన్ ప్రజాస్వామ్యానికి మంచి పరిణామం. అతివాదం, మితిమీరిన పక్షపాత ధోరణి, ద్వేష రాజకీయం స్థానంలో మితవాదం, మధ్యేమార్గం, ఇతర వర్గాలతో ఇచ్చిపుచ్చుకునే ధోరణి బలపడే అవకాశం ఉంది.

తమ 250వ స్వాతంత్ర్య వార్షికోత్సవ సంవత్సరంలో అమెరికన్లు ఇచ్చిన తీర్పు వల్ల ట్రంప్ పశ్చిమాసియా యుద్ధంలో వెనక్కి తగ్గే అవకాశం ఉంది. భారత్‌కు వీసాల విషయంలో ఊరట లభించవచ్చు. భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందం త్వరలో కుదరవచ్చు. ఇవన్నీ భారత్‌ని కొంత ఊపిరిపీల్చుకునేలా చేస్తాయి. మెరుగైన విద్య, అవకాశాల కోసం అమెరికా వెళ్లాలనుకుంటున్న మధ్యతరగతి భారతీయులకు ఈ ఫలితాలు ఉపశమనం. రిపబ్లికన్ అభ్యర్థుల్ని గెలిపిస్తే 5 వేల డాలర్ల చెక్ ఇస్తానని ట్రంప్ హామీ ఇవ్వటం, మస్క్ లేజర్ కిరణాల్లా డబ్బును వెదజల్లటం వంటివి ఉన్నా, ప్రజలు తమ రోజువారీ జీవితం, భవిష్యత్తు, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవటం కోసం ఓటు వేశారు. ట్రంప్ అతివాద దూకుడును సహించబోమని మధ్యేమార్గానికి పట్టం గట్టారు. మన దేశంలోనూ ప్రభుత్వాలు, ప్రతిపక్షాలు అధికారమే లక్ష్యంగా హేతుబద్ధతలేని విధానాలు, సాక్ష్యాధారాలు లేని ఆరోపణలు వంటివి కొనసాగిస్తే ఉనికిని కోల్పోవాల్సి వస్తుందని గుర్తించాలి. ప్రజాస్వామ్యంలో ఎంత అద్భుతంగా సోషల్ ఇంజినీరింగ్ చేసి ప్రజల్ని విభజించి ఒకరిమీద ఒకరిని ఉసిగొల్పి లబ్ధిపొందాలని చూసినా అది తాత్కాలికమేనని, తటస్థ ఓటర్లు ఏ పార్టీకీ గుత్తాధిపత్యాన్ని అందించరని ఈ ఎన్నికలు రుజువు చేశాయి. ప్రజాస్వామ్యంలో ప్రజాభిప్రాయం అంతిమం మాత్రమే కాదు, అది నిరంతరం మారుతూ దేశాన్ని సమాజాన్ని మెరుగుపరుస్తూ ఉంటుంది. అభ్యర్థుల ఎంపిక దగ్గర్నుంచి సంస్కరణల్ని అమలు చేస్తేనే ఎంత చరిత్ర ఉన్న పార్టీలు, నేతలకైనా భవిష్యత్తు ఉంటుంది. అతిపెద్ద ప్రజాస్వామ్యంగా భారత్ ఎంత బాధ్యతాయుతంగా వ్యవహరించాలో అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ప్రజల తీర్పు కీలక సమయంలో మనందరికీ గుర్తుచేసింది.

ప్రజాస్వామ్యానికి ప్రజలే ప్రాణం!

ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు నిర్వహించడం కాదు. ఐదేళ్లకోసారి ఓట్లు అడగడం, అధికారంలోకి వచ్చాక ప్రజలను మరిచిపోవడం ప్రజాస్వామ్య పాలనకు నిదర్శనం కాజాలదు. ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకోవడం, వారి సమస్యలకు పరిష్కారాలు చూపడం, ఇచ్చిన హామీలను అమలు చేయడం, పాలనలో పారదర్శకత పాటించడం.. ఇవే ప్రజాస్వామ్యానికి అసలైన అర్థం. కానీ నేటి రాజకీయ వాతావరణంలో ఈ మౌలిక సూత్రాలు ఎంతవరకు అమలవుతున్నాయన్న ప్రశ్న ప్రతి పౌరుడి మనసులో మెదులుతోంది. ఎన్నికల సమయంలో నాయకుల మాటలకు కొదవ ఉండదు. గ్రామాల నుంచి నగరాల వరకు హామీల వర్షం కురుస్తుంది. అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ పథకాలు, ఉద్యోగ అవకాశాలు, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం.. ఇలా ప్రతి అంశంపై భరోసాలు ఇస్తారు. ప్రచార సభల్లో ప్రజలే తమకు దేవుళ్లని చెబుతారు. కానీ ఎన్నికలు ముగిసి అధికారం చేతికి వచ్చాక అదే ప్రజలు తమ సమస్యలతో కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన పాలకులు, ప్రజలకే అందనంత దూరంలో ఉంటే ప్రజాస్వామ్యానికి ప్రయోజనం ఏమిటి?

హామీలకు కాలపరిమితి ఉండాలి

ఎన్నికల ప్రణాళికలు కేవలం ప్రచార పత్రాలుగా మిగిలిపోకూడదు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీకి ఒక స్పష్టమైన కార్యాచరణ ఉండాలి. ఏ పథకాన్ని ఎప్పుడు అమలు చేస్తారు? ఎంతమందికి ప్రయోజనం కలుగుతుంది? అందుకు అవసరమైన నిధులు ఎక్కడి నుంచి సమకూరుస్తారు? అమలులో ఎదురయ్యే సమస్యలేమిటి? అనే అంశాలపై ప్రభుత్వాలు ప్రజలకు వివరించాలి. హామీల అమలుపై నిర్దిష్ట కాలవ్యవధిలో నివేదికలు విడుదల చేయాలి. సంక్షేమం పేరుతో పథకాలు ప్రకటించడం ఎంత ముఖ్యమో, అవి అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడటం కూడా అంతే ముఖ్యం. అర్హత ఉన్నవారు కార్యాలయాల చుట్టూ తిరగడం, మధ్యవర్తుల జోక్యం, అధికారుల నిర్లక్ష్యం, సాంకేతిక కారణాలతో లబ్ధిదారులు ఇబ్బందులు పడటం వంటి సమస్యలు తొలగాలి. సంక్షేమం ప్రజల హక్కుగా అందాలి తప్ప అధికారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడకూడదు.

అభివృద్ధి అంటే ప్రచార ఆర్భాటం కాదు

అభివృద్ధి పేరుతో భారీ ప్రకటనలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరగడం సహజం. అయితే నిజమైన అభివృద్ధి ప్రజల జీవన ప్రమాణాల్లో కనిపించాలి. గ్రామాల్లో తాగునీరు అందుబాటులో ఉందా? రైతులకు సాగునీరు, గిట్టుబాటు ధర లభిస్తున్నాయా? ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందా? ఆసుపత్రుల్లో వైద్యులు, మందులు, అవసరమైన సదుపాయాలు ఉన్నాయా? నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారా? అన్న ప్రశ్నలకు సమాధానమే పాలన విజయానికి కొలమానం కావాలి. రోడ్లు, భవనాలు, ఫ్లైఓవర్లు నిర్మించడం అభివృద్ధిలో భాగమే. కానీ పేద కుటుంబానికి మెరుగైన వైద్యం అందించడం, విద్యార్థికి నాణ్యమైన విద్య కల్పించడం, రైతుకు పంట పెట్టుబడిపై భరోసా ఇవ్వడం, యువతకు ఉపాధి కల్పించడం కూడా అంతే కీలకం. ప్రజల ప్రాథమిక అవసరాలను పక్కనపెట్టి ప్రచార కార్యక్రమాలకే ప్రాధాన్యం ఇస్తే అభివృద్ధి అసంపూర్ణంగానే మిగిలిపోతుంది.

ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారీ కావాలి

ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ఎన్నికల్లో గెలిచిన తర్వాత కూడా ప్రజల మధ్య ఉండాలి. సమస్యలు విన్నప్పుడు పరిష్కారం చూపే ప్రయత్నం చేయాలి. ప్రజల వినతులను అధికారులకు పంపించడమే బాధ్యతగా భావించకూడదు. వాటి పరిష్కారం జరిగే వరకు పర్యవేక్షించాలి. ప్రజాప్రతినిధుల పనితీరును ప్రశ్నించడం ప్రజల హక్కు. ప్రశ్నించిన వారిని రాజకీయ ప్రత్యర్థులుగా చూడటం, విమర్శించిన వారిపై కక్ష సాధింపు ధోరణి ప్రదర్శించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. అధికారంలో ఉన్నవారు విమర్శలను స్వీకరించాలి. తప్పులుంటే సరిదిద్దుకోవాలి. ప్రజల అభిప్రాయాలకు విలువ ఇచ్చినప్పుడే పాలనపై విశ్వాసం పెరుగుతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా పాత్ర అత్యంత కీలకం. ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకురావడం, పాలకుల నిర్ణయాలను విశ్లేషించడం, అవినీతి, అక్రమాలను ప్రశ్నించడం, అధికార వ్యవస్థను అప్రమత్తం చేయడం మీడియా ప్రధాన బాధ్యత. అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా వార్తలు రాయడం మాత్రమే జర్నలిజం కాదు. ప్రజలకు ఉపయోగపడే వాస్తవాలను నిర్భయంగా వెల్లడించడమే అసలైన పాత్రికేయ ధర్మం. అయితే మీడియా రంగంలోనూ ఆత్మపరిశీలన అవసరం. సంచలనాల కోసం వాస్తవాలను పక్కనపెట్టడం, నిర్ధారణ కాని ఆరోపణలను వార్తలుగా ప్రచారం చేయడం, వ్యక్తిగత ప్రయోజనాలకు వార్తలను ఉపయోగించడం వంటి ధోరణులు విశ్వసనీయతను దెబ్బతీస్తాయి. అధికారాన్ని ప్రశ్నించాల్సిన మీడియా, అధికారానికి దగ్గరగా ఉండటానికే ప్రాధాన్యం ఇస్తే ప్రజల గొంతుక వినిపించేది ఎవరు? అందుకే జర్నలిజం స్వతంత్రతను, నిష్పక్షపాతాన్ని, వాస్తవ నిర్ధారణను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి మీడియా సంస్థపై ఉంది. దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని చెప్పడం సులభం. కానీ నిర్ణయాత్మక రాజకీయాల్లో వారికి ఎంత ప్రాధాన్యం ఇస్తున్నామన్నది ఆలోచించాల్సిన అంశం. నిరుద్యోగం, నైపుణ్యాల కొరత, ఉద్యోగాల కోసం వలసలు, పోటీ పరీక్షల ఒత్తిడి వంటి సమస్యలు యువతను వేధిస్తున్నాయి. వారి సమస్యలకు పరిష్కారం చూపే విధంగా ప్రభుత్వ విధానాలు రూపొందాలి. రాజకీయ పార్టీలు కూడా యువతను కేవలం ప్రచార కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, నిర్ణయాలు తీసుకునే స్థాయిలో అవకాశాలు కల్పించాలి. ప్రజాస్వామ్యం కేవలం పాలకుల బాధ్యత కాదు. ప్రజలకు కూడా సమానమైన బాధ్యత ఉంది. కులం, మతం, ప్రాంతం, వ్యక్తిగత అభిమానాల ఆధారంగా కాకుండా అభ్యర్థుల పనితీరు, నిజాయితీ, ప్రజాసేవా దృక్పథం ఆధారంగా నిర్ణయం తీసుకోవాలి. డబ్బు, మద్యం, తాత్కాలిక ప్రలోభాలకు ఓటును అమ్ముకోవడం వల్ల దీర్ఘకాలంలో నష్టపోయేది ప్రజలే. ఎన్నికల సమయంలో ప్రశ్నించే పౌరుడిగా, ఎన్నికల తర్వాత కూడా పాలనను పరిశీలించే బాధ్యతాయుత పౌరుడిగా ప్రతి ఒక్కరూ మారాలి. ప్రజాస్వామ్యానికి అసలైన బలం ప్రజల విశ్వాసం. ఆ విశ్వాసం నిలవాలంటే పాలకులు బాధ్యతగా వ్యవహరించాలి. అధికారులు నిష్పక్షపాతంగా పనిచేయాలి. ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండాలి. మీడియా వాస్తవాల పక్షాన నిలవాలి. ప్రజలు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలి. ఈ బాధ్యతలన్నీ సమర్థంగా నెరవేరినప్పుడే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుంది.

అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. పదవులు వస్తుంటాయి, పోతుంటాయి. కానీ ప్రజలకు చేసిన సేవ, నిలబెట్టుకున్న విలువలు, పరిష్కరించిన సమస్యలు మాత్రమే చరిత్రలో నిలిచిపోతాయి. ప్రజల ఓటు అధికారానికి మార్గం చూపుతుంది. అదే ఓటు పాలకుల పనితీరుకు తీర్పు కూడా ఇస్తుంది. ప్రజాస్వామ్యం అంటే ప్రజలను పాలించడం కాదు.. ప్రజల కోసం పాలించడం. ప్రజల గొంతుకను వినడం, వారి సమస్యలకు స్పందించడం, తప్పులను సరిదిద్దుకోవడం పాలకుల ప్రాథమిక బాధ్యత. హామీల రాజకీయాలకు స్వస్తి పలికి బాధ్యతాయుత పాలనకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడే ప్రజాస్వామ్యానికి నిజమైన గౌరవం లభిస్తుంది. మార్పు కోసం ఎదురు చూడటం కాదు.. మార్పుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. అదే బలమైన సమాజానికి పునాది!

యాక్ట్ ఈస్ట్ పాలసీకి ప్రాధాన్యం

న్యూఢిల్లీ / మనీలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం ఫిలిప్పీన్స్ పర్యటనకు బయలుదేరారు. మనీలా వేదికగా జరగనున్న 23వ ఆసియాన్-భారత్ సదస్సు, 21వ తూర్పు ఆసియా సదస్సులో ఆయన పాల్గొననున్నారు. ఆగ్నేయాసియా దేశాలతో భారత్ సంబంధాలను మరింత బలోపేతం చేయడం, వాణిజ్యం, సముద్ర భద్రత, రక్షణ, సాంకేతిక రంగాల్లో సహకారాన్ని విస్తరించడం ఈ పర్యటనలో ప్రధాన లక్ష్యాలుగా ఉన్నాయి. ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు ఫెర్డినాండ్ ఆర్. మార్కోస్ జూనియర్ ఆహ్వానం మేరకు మోదీ ఈ పర్యటన చేపట్టారు.

రేపు రెండు కీలక సదస్సులు

నవంబర్ 17న మనీలాలో జరిగే 23వ ఆసియాన్--భారత్ సదస్సు, 21వ తూర్పు ఆసియా సదస్సులో ప్రధాని పాల్గొంటారు. ఆసియాన్ దేశాల అధినేతలతో కలిసి ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై చర్చించనున్నారు. భారత్--ఆసియాన్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఇప్పటివరకు సాధించిన పురోగతిని సమీక్షించడంతో పాటు భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించే అవకాశం ఉంది. ఆసియాన్ దేశాలతో భారత్‌కు శతాబ్దాల చరిత్ర కలిగిన సాంస్కృతిక, నాగరికత సంబంధాలు ఉన్నాయని మోదీ పేర్కొన్నారు. ఈ సంబంధాలు ప్రస్తుతం వాణిజ్యం, మౌలిక సదుపాయాలు, సముద్ర సహకారం, సాంకేతిక పరిజ్ఞానం, ప్రజల మధ్య సంబంధాల వరకు విస్తరించాయని తెలిపారు. భారత విదేశాంగ విధానంలో యాక్ట్ ఈస్ట్ పాలసీకి ఆసియాన్ దేశాలు కీలకమని ఆయన స్పష్టం చేశారు.

మనీలాలో ఘన స్వాగతం

మోదీ సోమవారం మనీలాలోని విమానాశ్రయానికి చేరుకోగా ఫిలిప్పీన్స్ అధికారులు, ప్రతినిధులు స్వాగతం పలికారు. సంప్రదాయ సాంస్కృతిక ప్రదర్శనతో ఆయనకు స్వాగతం లభించింది. పర్యటనలో భాగంగా ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు మార్కోస్ నిర్వహించే విందులోనూ ప్రధాని పాల్గొననున్నారు.



సముద్ర భద్రతపై ప్రత్యేక చర్చలు

2026 సంవత్సరాన్ని భారత్--ఆసియాన్ దేశాలు సముద్ర సహకార సంవత్సరంగా నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సముద్ర భద్రత, నౌకాయాన రక్షణ, సముద్ర మార్గాల అనుసంధానం, బ్లూ ఎకానమీ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని కాపాడేందుకు పరస్పర సహకారాన్ని పెంచుకోవడంపై చర్చలు జరగనున్నాయి.

వాణిజ్యం, పెట్టుబడులపై దృష్టి

భారత్, ఆసియాన్ దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను మరింత విస్తరించడం ఈ సదస్సులో మరో కీలక అంశం. పెట్టుబడులు, సరఫరా వ్యవస్థలు, మౌలిక సదుపాయాల అనుసంధానం, డిజిటల్ పరిజ్ఞానం, రక్షణ రంగాల్లో పరస్పర సహకారానికి ఉన్న అవకాశాలను నేతలు చర్చించనున్నారు. భారత్-ఆసియాన్ వాణిజ్య ఒప్పందం సమీక్ష కూడా ఈ సంబంధాల్లో కీలక అంశంగా కొనసాగుతోంది.

2026-2030 కార్యాచరణ ప్రణాళిక

భారత్-ఆసియాన్ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యంలో భాగంగా 2026-2030 కార్యాచరణ ప్రణాళిక అమలుపై సమీక్ష జరగనుంది. ఇప్పటికే చేపట్టిన కార్యక్రమాల పురోగతిని పరిశీలించడంతో పాటు కొత్త రంగాల్లో సహకారాన్ని ఎలా విస్తరించాలనే దానిపై నేతలు దిశానిర్దేశం చేయనున్నారు.

ప్రవాస భారతీయులతో మోదీ భేటీ

ఫిలిప్పీన్స్‌లో నివసిస్తున్న భారతీయులతోనూ ప్రధాని మోదీ సమావేశం కానున్నారు. అక్కడి భారతీయ సమాజంతో మాట్లాడి వారి అనుభవాలు, అభిప్రాయాలను తెలుసుకోనున్నారు. విదేశాల్లో నివసిస్తున్న భారతీయులతో సంబంధాలను బలోపేతం చేయడంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం ఉంది.

2027లో కీలక వార్షికోత్సవాలు

2027లో భారత్-ఆసియాన్ మధ్య దౌత్య సంబంధాలు ప్రారంభమై 35 సంవత్సరాలు పూర్తికానున్నాయి. అలాగే సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఐదేళ్లు పూర్తవుతాయి. ఈ నేపథ్యంలో రానున్న సంవత్సరాల్లో ద్వైపాక్షిక సంబంధాలను మరింత విస్తరించేందుకు ప్రస్తుత పర్యటన దోహదపడుతుందని విదేశాంగ శాఖ భావిస్తోంది.

ఇండో-పసిఫిక్ ప్రాంతంపై అంతర్జాతీయ దృష్టి

తూర్పు ఆసియా సదస్సులో ప్రాంతీయ భద్రత, అంతర్జాతీయ పరిణామాలు, సముద్ర వివాదాలు, ఆర్థిక సహకారం వంటి అంశాలు చర్చకు రానున్నాయి. మనీలాలో క్వాడ్ దేశాల నేతల సమావేశం నిర్వహించే ప్రయత్నాలు కూడా జరుగుతున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే ఆ సమావేశం ఖరారైన కార్యక్రమంగా ప్రకటించబడలేదు. ప్రధాని మోదీ ఫిలిప్పీన్స్ పర్యటన భారత్-ఆసియాన్ సంబంధాలు, సముద్ర భద్రత, వాణిజ్యం, ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సహకారానికి సంబంధించిన కీలక దౌత్య కార్యక్రమంగా నిలవనుంది. నవంబర్ 17న జరిగే రెండు సదస్సుల్లో మోదీ పాల్గొననున్నారు.

యుద్ధ వేళ విదేశాలపై ఆధారపడే పరిస్థితి ఉండకూడదు!

న్యూఢిల్లీ: భవిష్యత్తులో యుద్ధం తలెత్తితే ఆయుధాలు, విడిభాగాలు, ఇంజిన్లు, సాంకేతిక పరిజ్ఞానం కోసం భారత్ విదేశీ శక్తులపై ఆధారపడే పరిస్థితి ఉండకూడదని భారత వైమానిక దళ చీఫ్ మార్షల్ అశుతోశ్ దీక్షిత్ స్పష్టం చేశారు. దేశ రక్షణ రంగంలో నిజమైన ఆత్మనిర్భరత సాధించడం పారిశ్రామిక లక్ష్యం మాత్రమే కాదని, అది నేరుగా సైనిక సంసిద్ధతకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. సంక్షోభ సమయాల్లో విదేశీ శక్తులు భారత రక్షణ సామర్థ్యాలను నిలువరించే అవకాశం లేకుండా స్వదేశీ సాంకేతికతను అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. దిల్లీలో నిర్వహించిన ఏఎన్ఐ జాతీయ భద్రతా సదస్సు 3.0లో పాల్గొన్న ఆయన భవిష్యత్ యుద్ధాలు, భారత రక్షణ సామర్థ్యాలు, స్వదేశీ ఆయుధాల అభివృద్ధి, చైనా సరిహద్దు పరిస్థితులపై కీలక వ్యాఖ్యలు చేశారు.

ఆత్మనిర్భరతే అసలైన రక్షణ కవచం

భారత వైమానిక దళానికి ఆత్మనిర్భరత అనేది కేవలం పారిశ్రామిక ఉత్పత్తి లక్ష్యం కాదని, కార్యాచరణ అవసరమని అశుతోశ్ దీక్షిత్ వివరించారు. యుద్ధ సమయంలో సోర్స్ కోడ్, విడిభాగాలు, మందుగుండు సామగ్రి, విమాన ఇంజిన్ల కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సిన పరిస్థితి రాకూడదన్నారు. స్వదేశీ పరిజ్ఞానంతోనే ఆయుధ వ్యవస్థలను నిర్వహించుకునే సామర్థ్యం దేశానికి ఉండాలని అభిప్రాయపడ్డారు. దేశ రక్షణ వ్యవస్థకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, విడిభాగాల సరఫరా నిరంతరంగా కొనసాగితేనే దీర్ఘకాలిక యుద్ధ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోగలమని పేర్కొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌తో స్వదేశీ ఆయుధాల సత్తా

త్రివిధ దళాల సమన్వయం, స్వదేశీ ఆయుధ వ్యవస్థల సామర్థ్యాన్ని ఆపరేషన్ సిందూర్ చాటిచెప్పిందని ఐఏఎఫ్ చీఫ్ పేర్కొన్నారు. ఆకాశ్, బ్రహ్మోస్ వంటి స్వదేశీ రక్షణ వ్యవస్థలు ఈ ఆపరేషన్‌లో సమర్థంగా పనిచేశాయని వివరించారు. త్రివిధ దళాల సంయుక్త కార్యకలాపాల్లో ఆపరేషన్ సిందూర్ ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచిందన్నారు. సైనిక సంసిద్ధతను అంచనా వేయడానికి నియంత్రణ, నిలకడ, పరిస్థితులకు అనుగుణంగా మారే సామర్థ్యం కీలకమని పేర్కొన్నారు.



సైబర్‌స్పేస్, అంతరిక్షంలోనే భవిష్యత్ యుద్ధాలు!

భవిష్యత్తులో యుద్ధాలు సంప్రదాయ పద్ధతుల్లోనే ప్రారంభం కావాల్సిన అవసరం లేదని అశుతోశ్ దీక్షిత్ అభిప్రాయపడ్డారు. సైబర్‌స్పేస్, విద్యుదయస్కాంత స్పెక్ట్రమ్, అంతరిక్ష రంగాల్లోనే ఘర్షణలు మొదలయ్యే అవకాశముందని హెచ్చరించారు. ప్రత్యర్థి దేశాల కంటే వేగంగా నిర్ణయాలు తీసుకోవడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించడం భవిష్యత్ యుద్ధాల్లో కీలకమవుతాయని వివరించారు.

క్షిపణుల నిల్వలే పెద్ద సవాలు

ఆధునిక యుద్ధాల్లో ఆయుధాల వినియోగంతో పాటు వాటి నిల్వలు, ఉత్పత్తి సామర్థ్యం కూడా కీలకమని ఆయన పేర్కొన్నారు. అమెరికా పేట్రియాట్ గగనతల రక్షణ క్షిపణుల వినియోగాన్ని ఉదాహరణగా ప్రస్తావించారు. ఇరాన్‌తో జరిగిన యుద్ధంలో అమెరికా తన క్షిపణి నిల్వల్లో గణనీయమైన భాగాన్ని వినియోగించిందని, వాటిని తిరిగి సమకూర్చుకోవడానికి ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉందని వివరించారు. దీంతో అత్యాధునిక రక్షణ పరిశ్రమలు ఉన్న దేశాలకు సైతం యుద్ధ అవసరాలకు అనుగుణంగా ఆయుధాల ఉత్పత్తి, నిల్వల నిర్వహణ పెద్ద సవాలుగా మారుతోందని ఆయన వ్యాఖ్యల సారాంశం.

తేజస్, ఎల్‌సీఏ మార్క్-2పై ఆశలు

స్వదేశీ యుద్ధ విమానాల అభివృద్ధిపై భారత వైమానిక దళం ప్రత్యేక దృష్టి పెట్టిందని అశుతోశ్ దీక్షిత్ తెలిపారు. ఎల్‌సీఏ మార్క్-1ఏ విమానాలను వైమానిక దళంలోకి చేర్చుకునే ప్రక్రియ కొనసాగుతోందని, తదుపరి తరం ఎల్‌సీఏ మార్క్-2, అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) అభివృద్ధి పనులు కూడా ముందుకు సాగుతున్నాయని వివరించారు. ఒక యుద్ధ విమానాన్ని అభివృద్ధి చేయాలంటే అనేక శాస్త్రీయ విభాగాల్లో నైపుణ్యం అవసరమని, తేజస్ అభివృద్ధిలో దేశవ్యాప్తంగా ఉన్న సంస్థలు, ప్రయోగశాలలు, పరిశోధనా కేంద్రాలు భాగస్వాములయ్యాయని పేర్కొన్నారు.

చైనా కదలికలపై నిఘా

చైనా సరిహద్దుల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలను భారత వైమానిక దళం నిరంతరం పర్యవేక్షిస్తోందని ఐఏఎఫ్ చీఫ్ వెల్లడించారు. ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. చైనా చేపట్టే దురాక్రమణ ప్రయత్నాలను నిలువరించే సామర్థ్యం భారత్‌కు ఉందని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం భారత్-చైనా సరిహద్దుల్లో పూర్తిస్థాయి శాంతి పరిస్థితులు లేవని, అదే సమయంలో యుద్ధ వాతావరణం కూడా లేదని వివరించారు. అవసరాన్ని బట్టి రక్షణాత్మక, దాడి వ్యూహాలకు మారేందుకు వైమానిక దళం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

స్వదేశీ రక్షణ రంగమే భవిష్యత్‌కు పునాది

మొత్తంగా భవిష్యత్ యుద్ధాల్లో విజయం సాధించాలంటే ఆయుధాల సంఖ్యతో పాటు వాటి తయారీ, మరమ్మతులు, సాంకేతిక నియంత్రణపై దేశానికి సంపూర్ణ సామర్థ్యం ఉండాలని అశుతోశ్ దీక్షిత్ వ్యాఖ్యలు స్పష్టం చేస్తున్నాయి. విదేశీ సరఫరాలపై ఆధారపడకుండా స్వదేశీ రక్షణ పరిశ్రమను బలోపేతం చేయడం ద్వారా మాత్రమే దీర్ఘకాలిక సైనిక సంసిద్ధత సాధ్యమవుతుందనే అంశాన్ని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు.

కుటుంబంపై ప్రచారమైన అసత్యాలకు నా ఆత్మకథే సమాధానం!

న్యూఢిల్లీ: తన కుటుంబం గురించి ఎన్నో అవాస్తవాలు, కల్పిత కథనాలు ప్రచారంలోకి వచ్చాయని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియా గాంధీ అన్నారు. తన అత్త ఇందిరా గాంధీ, భర్త రాజీవ్ గాంధీ, కుమారుడు రాహుల్ గాంధీ, కుమార్తె ప్రియాంక గాంధీతో పాటు తన వ్యక్తిగత జీవితం గురించి కూడా అనేక అసత్య ప్రచారాలు జరిగాయని పేర్కొన్నారు. ఇలాంటి కథనాలకు వాస్తవాలతో సమాధానం చెప్పాలనే ఉద్దేశంతోనే తన ఆత్మకథ రాయాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. సోమవారం దిల్లీలో తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు.

కుటుంబ జీవితంలోని ఎన్నో తెలియని విషయాలు

తన జీవితంలో ఎదురైన అనుభవాలు, కుటుంబంతో అనుబంధం, రాజకీయ ప్రయాణం, వ్యక్తిగత జీవితంలోని ముఖ్యమైన ఘట్టాలను ఈ పుస్తకంలో పొందుపరిచినట్లు సోనియా గాంధీ తెలిపారు. తన కుటుంబం గురించి ప్రజల్లో అనేక రకాల కథనాలు ప్రచారంలో ఉన్నాయని, వాటిలో చాలా వరకు వాస్తవాలకు దూరంగా ఉన్నాయని అన్నారు. తనకు తెలిసిన నిజాలను, తాను స్వయంగా అనుభవించిన విషయాలను ప్రజలతో పంచుకోవాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని రచించినట్లు వివరించారు.

రాహుల్, ప్రియాంక సమక్షంలో ఆవిష్కరణ

దిల్లీలోని ఐటీసీ మౌర్య హోటల్‌లో సోనియా గాంధీ ఆత్మకథ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సోనియా కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతల సమక్షంలో పుస్తకాన్ని ఆవిష్కరించారు.



ఇండియా కూటమి నేతల సందడి

ఈ కార్యక్రమానికి ఇండియా కూటమికి చెందిన పలువురు ప్రముఖ నేతలు హాజరయ్యారు. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, తృణమూల్ కాంగ్రెస్ నేత అభిషేక్ బెనర్జీ, ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఎన్సీపీ నేత సుప్రియా సూలే తదితరులు పాల్గొన్నారు. అలాగే కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు సహా పలువురు రాజకీయ ప్రముఖులు ఈ వేడుకకు హాజరయ్యారు.

రాజకీయాల వెనుక వ్యక్తిగత ప్రయాణం

సోనియా గాంధీ ఆత్మకథలో ఆమె వ్యక్తిగత జీవితం, రాజీవ్ గాంధీతో పరిచయం, వివాహం, నెహ్రూ-గాంధీ కుటుంబంతో అనుబంధం, రాజకీయాల్లోకి ప్రవేశం, కాంగ్రెస్ నాయకత్వ బాధ్యతలు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. కుటుంబంలో ఎదురైన విషాదాలు, రాజకీయ జీవితంలో ఎదురైన సవాళ్లు, ప్రజా జీవితంలో తన అనుభవాలను కూడా ఈ రచన ద్వారా పాఠకులకు పరిచయం చేయనున్నారు. దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో ఎన్నో కీలక పరిణామాలకు సాక్షిగా నిలిచిన సోనియా గాంధీ తన జీవితాన్ని స్వయంగా అక్షరబద్ధం చేయడం ఈ పుస్తకానికి ప్రత్యేకతగా నిలుస్తోంది. కుటుంబం, రాజకీయాలు, వ్యక్తిగత అనుభవాల సమ్మేళనంగా వెలువడిన ఈ ఆత్మకథపై రాజకీయ, సాహిత్య వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

ఎస్ఐఆర్‌పై ఈసీని నిలదీసేందుకు అనుమతించండి!

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా ఇండియా కూటమి విపక్ష నేతలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈసీ నిర్ణయాలు, ఓటర్ల తొలగింపు ప్రక్రియ, ఆన్‌లైన్ ఓటరు నమోదు వ్యవస్థల్లో చేసిన మార్పులపై సమాధానాలు కోరుతూ 48 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని న్యాయస్థానానికి సమర్పించారు. ఈ వ్యవహారంలో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాల వెనుక ఉన్న విధానాలు, వాటికి సంబంధించిన అధికారిక రికార్డులపై స్పష్టత ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు.

సీఈసీ ఏకపక్షంగా నిర్ణయించారా?

దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ అమలుకు సంబంధించిన నిర్ణయాలను ఎన్నికల సంఘం సమిష్టిగా తీసుకుందా? లేక ఇతర ఎన్నికల కమిషనర్ల అంగీకారం లేకుండానే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నిర్ణయాలు తీసుకున్నారా? అనే అంశాన్ని విపక్ష నేతలు ప్రధానంగా ప్రస్తావించారు. ఈ ప్రక్రియకు అనుమతిస్తూ ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయానికి సంబంధించిన అధికారిక రికార్డులు, సమావేశాల వివరాలను వెల్లడించాలని కోరారు. ఎన్నికల సంఘం నిర్ణయాధికారాన్ని ఏ విధంగా వినియోగించిందనే అంశంపై వివరణ అవసరమని పేర్కొన్నారు.

ఓట్ల తొలగింపుపై సమాధానాలివ్వాలి

ప్రత్యేక సమగ్ర సవరణ పేరుతో ఓటర్ల జాబితాల నుంచి పేర్లు తొలగిస్తున్నారనే ఆరోపణలపై కూడా విపక్ష నేతలు ప్రశ్నలు లేవనెత్తారు. ఓటర్ల పేర్ల తొలగింపునకు అనుసరిస్తున్న విధానం, దానికి సంబంధించిన నిబంధనలు, అధికారుల బాధ్యతలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. డిప్యూటీ ఎన్నికల కమిషనర్ నుంచి ఈ అంశాలకు సంబంధించిన సమాధానాలు కోరేందుకు అనుమతి ఇవ్వాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఓటర్ల హక్కులకు సంబంధించిన ప్రక్రియలో పారదర్శకత ఉండాలని అభిప్రాయపడ్డారు.

ఫారం-6లో మార్పులపై అభ్యంతరాలు

కొత్త ఓటరు నమోదుకు ఉపయోగించే ఆన్‌లైన్ ఫారం-6లో చేసిన మార్పులు, ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఈసీఐనెట్, ఈఆర్‌వోనెట్ వ్యవస్థల పనితీరుపైనా విపక్ష నేతలు ప్రశ్నలు సంధించారు. ఈ డేటాబేస్‌లు కేంద్రీకృతంగా ఉండటంతో పాటు వాటి నిర్వహణలో పారదర్శకత లోపించిందని వారు ఆరోపించారు. ఎన్నికల సంఘం పోర్టల్‌లో ఎప్పటికప్పుడు చేసిన అప్‌డేట్లు, మార్పుల వివరాలు, వాటిని అమలు చేసిన అధికారుల సమాచారాన్ని అందించాలని కోరారు.

ఈసీ వాదన మరోలా..

మరోవైపు ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి తాము తీసుకున్న నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే జరిగాయని ఎన్నికల సంఘం ఇప్పటికే సుప్రీంకోర్టుకు తెలిపింది. చట్ట నిబంధనలకు అనుగుణంగానే ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టామని వివరించింది. ఫారం-6లో ఎలాంటి మార్పులు చేయలేదని కూడా స్పష్టం చేసింది. దీంతో ఎన్నికల సంఘం వాదనలకు, విపక్ష నేతలు లేవనెత్తుతున్న సందేహాలకు మధ్య వివాదం కొనసాగుతోంది.

17న సుప్రీంకోర్టులో కీలక విచారణ

ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రధాన ఎన్నికల కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, ఇష్టానుసారంగా ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారని ఆరోపిస్తూ రాహుల్ గాంధీ సహా 12 మంది విపక్ష నేతలు గతంలో సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లు ప్రస్తుతం విచారణలో ఉన్నాయి. ఈ కేసులపై నవంబర్ 17న సుప్రీంకోర్టు మరోసారి విచారణ చేపట్టనుంది. ఈ నేపథ్యంలో 48 ప్రశ్నలతో కూడిన తాజా ప్రశ్నావళి ప్రాధాన్యం సంతరించుకుంది. ఎన్నికల సంఘం నిర్ణయాల ప్రక్రియ, ఓటర్ల జాబితాల సవరణలో పారదర్శకత, ఓటర్ల హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై న్యాయస్థానం విచారణలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయన్నది ఆసక్తికరంగా మారింది.

ఇంధన ధరల సెగ..

టోకు ద్రవ్యోల్బణం 12.29 శాతానికి!

న్యూఢిల్లీ, నవంబర్ 16: దేశంలో టోకు ధరల ద్రవ్యోల్బణం మరోసారి భారీగా పెరిగింది. ఇంధనం, ముడి చమురు, విద్యుత్ ధరలు ఎగబాకడంతో అక్టోబరు నెలలో హోల్‌సేల్ ప్రైస్ ఇండెక్స్ ఆధారిత ద్రవ్యోల్బణం 12.29 శాతానికి చేరింది. సెప్టెంబరులో నమోదైన 11.39 శాతంతో పోలిస్తే గణనీయంగా పెరిగింది. వరుసగా మూడో నెల కూడా టోకు ధరల ద్రవ్యోల్బణం పెరగడం ఆర్థిక వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సోమవారం గణాంకాలను విడుదల చేసింది.

ఇంధనం, విద్యుత్ ధరలే ప్రధాన కారణం

అక్టోబరులో ఇంధనం, విద్యుత్ విభాగంలో ద్రవ్యోల్బణం 32.84 శాతానికి చేరింది. సెప్టెంబరులో ఇది 25.85 శాతంగా ఉంది. ముడి చమురు, సహజ వాయువు, మినరల్ ఆయిల్స్ ధరలు పెరగడం ఈ పరిణామానికి ప్రధాన కారణంగా నిలిచింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల్లో మార్పులు దేశీయ ఇంధన వ్యయాలపై ప్రభావం చూపుతున్నాయి.

ముడి చమురు, సహజ వాయువులో భారీ పెరుగుదల

ముడి పెట్రోలియం, సహజ వాయువు విభాగంలో ద్రవ్యోల్బణం సెప్టెంబరులో 57.32 శాతంగా ఉండగా అక్టోబరులో 70.80 శాతానికి పెరిగింది. మినరల్ ఆయిల్స్‌లోనూ ద్రవ్యోల్బణం 40.02 శాతం నుంచి 45.57 శాతానికి చేరింది. విద్యుత్ విభాగంలో గత నెల నమోదైన 0.43 శాతం క్షీణత స్థానంలో అక్టోబరులో 8.06 శాతం ద్రవ్యోల్బణం నమోదైంది.

ప్రాథమిక వస్తువుల ధరలూ పైపైకి

ప్రాథమిక వస్తువుల ద్రవ్యోల్బణం సెప్టెంబరులో 8.67 శాతంగా ఉండగా అక్టోబరులో 9.24 శాతానికి పెరిగింది. ప్రాథమిక ఆహార పదార్థాల ద్రవ్యోల్బణం 8.14 శాతం నుంచి 8.26 శాతానికి చేరింది. ఆహార పదార్థాలు, లోహాలు, రసాయనాల ధరల పెరుగుదల కూడా టోకు ధరల సూచీపై ప్రభావం చూపింది.

పాక్ చేతికి లక్ష ఎఫ్‌పీవీ డ్రోన్లు!

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఎదురైన సైనిక సవాళ్ల తర్వాత పాకిస్థాన్ తన రక్షణ సామర్థ్యాలను మరింత పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తన మిత్రదేశమైన తుర్కియేతో భారీ రక్షణ ఒప్పందం కుదుర్చుకున్నట్లు రక్షణ రంగానికి చెందిన పలు కథనాలు వెల్లడిస్తున్నాయి. మూడేళ్ల కాలంలో లక్ష మెర్కుట్ ఎఫ్‌పీవీ డ్రోన్లను కొనుగోలు చేయడంతో పాటు పలు రకాల మానవరహిత యుద్ధ వ్యవస్థలను సమకూర్చుకోవాలని నిర్ణయించినట్లు సమాచారం. పాకిస్థాన్‌లోనే వీటి తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసే ప్రతిపాదన కూడా ఈ ఒప్పందంలో ఉన్నట్లు తెలుస్తోంది.

డ్రోన్లతో పాటు ఇతర యుద్ధ వ్యవస్థలు

ఈ ఒప్పందంలో భాగంగా లక్ష మెర్కుట్ ఎఫ్‌పీవీ డ్రోన్లతో పాటు పది ఆల్బైన్ మానవరహిత హెలికాప్టర్లు, 25 చిన్న హెలికాప్టర్లు, 500 డీఎల్ఈ తరహా సంచార దాడి ఆయుధాలు, 250 కోర్గాన్ భూతల వ్యవస్థలు సరఫరా కానున్నట్లు రక్షణ రంగ కథనాలు పేర్కొంటున్నాయి. వీటిని పాకిస్థాన్ సైనిక అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవడంతో పాటు స్థానికంగా తయారీ చేపట్టేలా ఏర్పాట్లు చేయనున్నట్లు సమాచారం. అయితే ఈ ఒప్పందానికి సంబంధించిన పూర్తి వివరాలు, అధికారిక ధ్రువీకరణపై స్పష్టత రావాల్సి ఉంది.

8 కిలోమీటర్ల పరిధిలో లక్ష్యాలను గుర్తించే సామర్థ్యం

మెర్కుట్ ఎఫ్‌పీవీ డ్రోన్ల పరిధి సుమారు 8 కిలోమీటర్లుగా పేర్కొంటున్నారు. ఇవి 20 నుంచి 30 నిమిషాల వరకు గాల్లో ఉండగలవని సమాచారం. వీటిలో పేలుడు పదార్థాలు అమర్చే సామర్థ్యం ఉందని, కొన్ని నమూనాల్లో చిన్న లోహపు గుండ్లను వినియోగించే పేలుడు సామగ్రి ఉంటుందని రక్షణ కథనాలు వెల్లడిస్తున్నాయి.

మానవరహిత హెలికాప్టర్లతో భారీ దాడులు?

ఆల్బైన్ మానవరహిత హెలికాప్టర్లు భారీ పేలుడు సామగ్రిని మోసుకెళ్లగల సామర్థ్యం కలిగి ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ముందుగానే నిర్దేశించిన లక్ష్యాలు, మార్గాలకు అనుగుణంగా స్వయంచాలకంగా పనిచేసే సాంకేతికతను వీటిలో ఉపయోగించినట్లు సమాచారం. రాత్రివేళల్లో కార్యకలాపాల కోసం ఉష్ణ దృశ్య, రాత్రి దృష్టి సాంకేతికతలను కూడా వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక డుమ్‌రుల్ వ్యవస్థను స్వల్ప దూర నిఘా, దాడి కార్యకలాపాలకు ఉపయోగించవచ్చని రక్షణ రంగ కథనాలు పేర్కొంటున్నాయి. ఈ వ్యవస్థ సుమారు రెండు గంటల పాటు గాల్లో ఉండగలదని సమాచారం. ఎఫ్‌పీవీ అంటే ఫస్ట్ పర్సన్ వ్యూ. అంటే మొదటి వ్యక్తి దృష్టికోణం నుంచి యుద్ధరంగాన్ని వీక్షించే సాంకేతికత. ఈ తరహా డ్రోన్లకు ముందు భాగంలో కెమెరా ఉంటుంది.

ఐక్యతతో నూరుశాతం విజయం సాధించాలి

- గ్రూపులు, పంతాలు పక్కనపెట్టి గ్రామాల అభివృద్ధికి ఏకగ్రీవాలకు మొగ్గుచూపాలి
- రాజకీయాలకు అతీతంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది
- రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి



ఆగిరిపల్లి, మహానగర్

అభివృద్ధి, సంక్షేమంతో పాటు కూటమి పార్టీల ఐక్యతకు స్థానిక సంస్థల ఎన్నికలు నిదర్శనంగా నిలవాలని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. గ్రూపులు, పంతాలు, పట్టింపులు పక్కనపెట్టి సమష్టిగా పనిచేస్తే రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మండలంలోని 25 గ్రామ పంచాయతీల్లో నూరుశాతం విజయం సాధించడం సాధ్యమని అన్నారు. ఆగిరిపల్లి మండలం సింహాద్రి అప్పారావుపేట–రాజవరం గొల్లగూడెంలోని కాట్రగడ్డ గార్డెన్స్‌లో సోమవారం స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన, ఓటమి పాలైన అభ్యర్థులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలతో మంత్రి సమావేశం నిర్వహించారు. రెండున్నరేళ్లలో మండలం, గ్రామాల వారీగా జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ప్రజా సమస్యల పరిష్కారం, ఇంకా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తికాగానే ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అన్ని కార్యక్రమాలను పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో జరిగిన లోటుపాట్లను సరిదిద్దుకుని ముందుకు సాగితే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని, ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ భవిష్యత్తులో అవకాశం వచ్చినప్పుడు పార్టీ అధిష్ఠానం తప్పకుండా గుర్తిస్తుందని భరోసా ఇచ్చారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ఫలితాలతో సంబంధం లేకుండా ప్రజల మధ్య ఉంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయడమే నాయకుడి ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. స్వల్ప మెజారిటీతో ఓటమి చెందిన అభ్యర్థులు అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు 50 శాతానికి తగ్గకుండా ప్రాతినిధ్యం కల్పించే బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని, సామాజిక న్యాయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. గ్రామాల్లో రాజకీయ విభేదాలు, పంతాలు పక్కనపెట్టి అభివృద్ధి కోసం అందరూ ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలను దెబ్బతీసి రూ.13.50 లక్షల కోట్ల అప్పుల భారం మోపిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు దశలవారీగా వ్యవస్థలను గాడిలో పెడుతున్నారని విమర్శించారు. పంచాయతీ ఎన్నికల్లో రాజకీయ కక్షలకు తావులేకుండా గ్రామస్తులంతా ఐక్యంగా సర్పంచులను ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని సూచించారు. ఏకగ్రీవ ఎన్నికలతో సమయం, ప్రజాధనం ఆదా కావడంతో పాటు గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ అగ్రిమిషన్ వైస్ చైర్మన్, నియోజకవర్గ పరిశీలకుడు మర్రిరెడ్డి శ్రీనివాసరెడ్డి, స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపొందిన కూటమి జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులు, ఓటమి పాలైన అభ్యర్థులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామాల ప్రజాప్రతినిధులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సమక్షంలో టీడీపీలో చేరిన 45 మంది

విజయవాడ, మహానగర్

జిల్లాలోని తిరువూరు నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో టీడీపీలో చేరారు. నగరంలోని ఎంపీ కార్యాలయంలో సోమవారం పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) సమక్షంలో తిరువూరు, ఏ.కొండూరు మండలాలకు చెందిన మొత్తం 45 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ కండువాలు కప్పుకున్నారు. తిరువూరు మండలం ఆంజనేయపురం గ్రామానికి చెందిన 2019 ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసిన బల్లెపోగు బాబురావు తన అనుచరులు 24 మందితో కలిసి టీడీపీలో చేరగా, ఎంపీ కేశినేని శివనాథ్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అలాగే ఏ.కొండూరు మండలం కంభంపాడు గ్రామానికి చెందిన 20 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరిలో వైసీపీలో కీలకంగా వ్యవహరించిన మంచి కంటి రాజశేఖర్, ఆయన భార్య విజయలక్ష్మి, మెంతుల శ్రీనివాస్ యాదవ్, బాలమర్తి కృష్ణ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీపై నమ్మకంతో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, గుర్తింపు కల్పిస్తామని తెలిపారు. పార్టీలో చేరిన వారిని కొత్తవారిగా కాకుండా కుటుంబ సభ్యులుగా భావించి కలుపుకొని ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. తిరువూరు నియోజకవర్గ అభివృద్ధికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయపురం మాజీ గ్రామ పార్టీ అధ్యక్షుడు మామిడి గాంధీ, తిరువూరు నియోజకవర్గ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు తుమ్మలపల్లి వెంకట పుల్లారావు, ఏ.కొండూరు మండల టీడీపీ అధ్యక్షుడు పీక్లా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంతంగా కొనసాగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ

విజయవాడ, మహానగర్

జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల మొదటి దశకు సంబంధించి రెండో రోజు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ వెల్లడించారు. మొదటి దశలో భాగంగా విజయవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాలు, తిరువూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఒక మండలం కలిపి మొత్తం ఐదు మండలాల్లో నామినేషన్ల స్వీకరణ కొనసాగుతోందని తెలిపారు. రెండో రోజు సర్పంచ్ స్థానాలకు మొత్తం 243 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 1,443 నామినేషన్లు దాఖలయ్యాయని కలెక్టర్ వివరించారు. మొదటి రోజు సర్పంచ్ స్థానాలకు 52 నామినేషన్లు, వార్డు సభ్యుల స్థానాలకు 140 నామినేషన్లు దాఖలయ్యాయి. రెండో రోజు నమోదైన నామినేషన్లతో కలిపి ఇప్పటివరకు సర్పంచ్ స్థానాలకు మొత్తం 295, వార్డు సభ్యుల స్థానాలకు 1,583 నామినేషన్లు అందినట్లు తెలిపారు. సర్పంచ్ స్థానాలకు అత్యధికంగా జి.కొండూరు మండలంలో 107 నామినేషన్లు, విజయవాడ రూరల్ మండలంలో 69 నామినేషన్లు దాఖలయ్యాయి. వార్డు సభ్యుల స్థానాలకు అత్యధికంగా విజయవాడ రూరల్ మండలంలో 513 నామినేషన్లు, జి.కొండూరు మండలంలో 399 నామినేషన్లు నమోదయ్యాయి. జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, ఎన్నికల నియమావళిని కచ్చితంగా అమలు చేస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, ప్రజలు ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ అధికారులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ కోరారు.

మొదటి దశ ఎన్నికలకు రెండో రోజు ముగిసిన నామినేషన్ల స్వీకరణ

రెండో రోజు సర్పంచ్ స్థానాలకు 243, వార్డు సభ్యుల స్థానాలకు 1,443 నామినేషన్లు దాఖలు

మొదటి రెండు రోజుల్లో సర్పంచ్ స్థానాలకు 295, వార్డు సభ్యుల స్థానాలకు 1,583 నామినేషన్లు

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ



ఈ నెల 19న కంపెనీ స్పెసిఫిక్ జాబ్ డ్రైవ్

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

విజయవాడ, మహానగర్



జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీ గురువారం విజయవాడలో కంపెనీ స్పెసిఫిక్ జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఈ జాబ్ డ్రైవ్ విజయవాడలోని గుణదల ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ డిగ్రీ కళాశాలలో ఉదయం 9.00 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్హతలు కలిగి, 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయస్సు గల యువతీ యువకులు ఈ ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15,000 నుంచి రూ.30,000 వరకు వేతనంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించనున్నట్లు వెల్లడించారు. జాబ్ డ్రైవ్‌కు హాజరైన అభ్యర్థులకు సంబంధిత కంపెనీ ప్రతినిధుల ద్వారా ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హత, ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ముందుగా వెబ్‌సైట్‌లో తమ పూర్తి వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే సమయంలో రెజ్యూమ్ లేదా బయోడేటాతో పాటు ఆధార్ కార్డు, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్, పాన్ కార్డు, విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు వెంట తీసుకురావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9032633548 నంబర్‌ను సంప్రదించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ నైపుణ్యాలకు తగిన ఉద్యోగాలు పొందాలని కోరారు. ఈ జాబ్ డ్రైవ్ ఏర్పాట్లను జిల్లా ఉపాధి, నైపుణ్య అధికారి సి.మధుభూషణ్ రావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

మూడు విడతల్లో 288 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు..

8.35 లక్షల మంది ఓటర్లు

3,287 పోలింగ్ కేంద్రాలు.. ఎన్నికల విధులకు 9,782 మంది సిబ్బంది

2,800 మంది పోలీసులతో భద్రత.. సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘా

ఏకగ్రీవ గ్రామ పంచాయతీలకు రూ.15 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ప్రోత్సాహక నిధులు



విజయవాడ, మహానగర్

జిల్లాలో గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం జిల్లాలోని 16 మండలాల పరిధిలో మూడు విడతల్లో 288 గ్రామ పంచాయతీలు, 3,088 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మొత్తం 3,287 పోలింగ్ కేంద్రాల్లో 8,35,515 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనుండగా, వీరిలో 4,06,803 మంది పురుషులు, 4,28,680 మంది మహిళలు, 32 మంది ఇతర ఓటర్లు ఉన్నారని వివరించారు. మొదటి విడతలో విజయవాడ డివిజన్ పరిధిలో 73 గ్రామ పంచాయతీలు, 856 వార్డులు, 1,001 పోలింగ్ కేంద్రాలకు నవంబర్ 26న ఎన్నికలు నిర్వహించనున్నారు. రెండవ విడతలో నందిగామ, జగ్గయ్యపేట ప్రాంతాల్లో 138 గ్రామ పంచాయతీలు, 1,432 వార్డులు, 1,468 పోలింగ్ కేంద్రాలకు నవంబర్ 29న, మూడవ విడతలో తిరువూరు డివిజన్ పరిధిలో 77 గ్రామ పంచాయతీలు, 800 వార్డులు, 818 పోలింగ్ కేంద్రాలకు డిసెంబర్ 2న పోలింగ్ జరగనుంది. పోలింగ్ ముగిసిన అనంతరం అదే రోజు ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటించనున్నారు. మొదటి విడత నామినేషన్ల స్వీకరణకు నవంబర్ 17 చివరి తేదీ కాగా, ఉపసంహరణకు నవంబర్ 21 చివరి తేదీగా నిర్ణయించారు. రెండవ విడతకు నామినేషన్ల స్వీకరణ నవంబర్ 20 వరకు, ఉపసంహరణ నవంబర్ 24 వరకు, మూడవ విడతకు నామినేషన్ల స్వీకరణ నవంబర్ 23 వరకు, ఉపసంహరణ నవంబర్ 27 వరకు కొనసాగనుంది. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల అనంతరం ఉప సర్పంచ్ ఎన్నికలను ప్రత్యేక సమావేశాల ద్వారా నిర్వహించనున్నారు. ఎన్నికల విధుల కోసం 3,615 మంది ప్రిసైడింగ్ అధికారులు, 6,167 మంది ఇతర పోలింగ్ సిబ్బంది కలిపి మొత్తం 9,782 మందిని గుర్తించి శిక్షణ అందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సుమారు 2,800 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, దాదాపు 50 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి ప్రత్యేక పోలీసు మార్చ్‌లు నిర్వహించినట్లు పేర్కొన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక, క్రిటికల్ పోలింగ్ కేంద్రాల్లో అదనపు భద్రతతో పాటు వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాల ద్వారా పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల సిబ్బంది, సామగ్రి, పర్యవేక్షణ బృందాల రవాణా కోసం 395 బస్సులు, 116 ఇతర వాహనాలు కలిపి మొత్తం 511 వాహనాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. సర్పంచ్ అభ్యర్థులకు పింక్ రంగు, వార్డు సభ్యుల అభ్యర్థులకు తెలుపు రంగు బ్యాలెట్ పత్రాలు వినియోగించనున్నట్లు వివరించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు మండల స్థాయిలో ప్రత్యేక బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలను ఏర్పాటు చేసి అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై నిఘా ఉంచనున్నట్లు తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ర్యాంపులు, వీల్‌చైర్లు తదితర కనీస సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారం కోసం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయంతో పాటు కలెక్టరేట్‌లో 24 గంటల ప్రత్యేక ఫిర్యాదుల పరిష్కార సెల్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఐక్యత, సామరస్యం, అభివృద్ధిని ప్రోత్సహించేందుకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యే గ్రామ పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన ప్రోత్సాహక నిధులు అందించనున్నట్లు వెల్లడించారు. 5,000 లోపు జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు రూ.15 లక్షలు, 5,001 నుంచి 10,000 జనాభా ఉన్న వాటికి రూ.25 లక్షలు, 10,000 పైబడిన జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు రూ.50 లక్షలు అందించనున్నట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు లొంగకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికలకు సంబంధించి సందేహాలు, ఫిర్యాదులు లేదా సమాచారం కోసం 9154970454 నంబర్‌లో కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని తెలిపారు.

బిజినెస్

భారత్ ఏఐ పాలసీ భేష్.. యూరప్‌లా కఠినంగా లేదు


ఐబీఎం సీఈఓ అరవింద్ కృష్ణ

ప్రపంచ ఏఐ రంగంలో భారత్ మరింత కీలక పాత్ర పోషించగలదన్న అరవింద్ కృష్ణ

యూరప్‌లా కాకుండా అతి నియంత్రణకు దూరంగా ఉండటం మంచి నిర్ణయమని వెల్లడి

ఏఐలో ప్రభుత్వం విజేతలను ఎంపిక చేసే విధానం ప్రమాదకరమని వ్యాఖ్య

భారత్‌ను గొప్ప మార్కెట్‌గా, ఉత్పత్తి కేంద్రంగా చూస్తున్న ఐబీఎం



ప్రపంచ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో ప్రస్తుతం ఉన్న దానికంటే భారత్ చాలా పెద్ద పాత్ర పోషించే సత్తా ఉందని, ఇందుకు పటిష్ఠమైన ప్రభుత్వ విధానాలు దోహదపడతాయని ఐబీఎం చైర్మన్, సీఈఓ అరవింద్ కృష్ణ అన్నారు. తాజాగా ఆయన ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఏఐ విషయంలో భారత ప్రభుత్వ విధానాన్ని ఆయన ప్రశంసించారు. యూరప్‌లో మాదిరిగా అతిగా నియంత్రణ విధించకుండా, ఆవిష్కరణలకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం జాగ్రత్త పడుతోందని అరవింద్ కృష్ణ అభిప్రాయపడ్డారు. యూరప్‌లో కఠిన నిబంధనల వల్ల ఏఐ ఎకోసిస్టమ్ దాదాపుగా లేకుండా పోయిందని ఆయన గుర్తుచేశారు. ఆధార్, డిజిటల్ పేమెంట్లు, క్విక్ కామర్స్ వంటి రంగాల్లో భారత్ అద్భుతమైన విజయం సాధించిందని, కానీ ఏఐ విషయంలో తన స్థానం ఏమిటో ఇంకా స్పష్టంగా నిర్ధారించుకోవాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. దేశీయంగా తయారైన ఏఐని ప్రోత్సహించడానికి, వివిధ ప్రభుత్వ ప్రయోజనాల కోసం దాన్ని ఉపయోగించుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. అదే సమయంలో ప్రభుత్వమే పారిశ్రామిక విధానాలను నిర్దేశిస్తూ, ఏ సంస్థలు విజయం సాధించాలో నిర్ణయించడం ప్రమాదకరమైన పోకడ అని ఆయన హెచ్చరించారు. చాలా మంది ఇలాంటి విధానాలను కోరుకున్నప్పటికీ, ప్రభుత్వం అలా విజేతలను ఎంపిక చేయడం మంచిది కాదని స్పష్టం చేశారు. ఐబీఎంకు ప్రపంచవ్యాప్తంగా భారత్ ఒక కీలకమైన భాగస్వామి అని అరవింద్ కృష్ణ తెలిపారు. "భారత్ ఒక గొప్ప మార్కెట్. ఉత్పత్తులను తయారు చేయడానికి, ప్రపంచవ్యాప్తంగా ఐబీఎంకు సేవలు అందించే ఉద్యోగులను కలిగి ఉండటానికి ఇది ఒక అద్భుతమైన ప్రదేశం" అని ఆయన వివరించారు. ఇప్పటికే భారత ప్రభుత్వం 'ఇండియా ఏఐ గవర్నెన్స్ గైడ్‌లైన్స్' పేరుతో మార్గదర్శకాలను విడుదల చేసింది. బాధ్యతాయుతమైన ఏఐ ఆవిష్కరణలే లక్ష్యంగా ఈ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించింది. డీప్‌ఫేక్‌లు, తప్పుడు సమాచారం, అల్గారిథమిక్ బయాస్ వంటి ప్రమాదాలను నివారించడం దీని ఉద్దేశం. ఈ మార్గదర్శకాల ప్రకారం, ఏఐ గవర్నెన్స్ గ్రూప్, టెక్నాలజీ అండ్ పాలసీ ఎక్స్‌పర్ట్ కమిటీ, ఏఐ సేఫ్టీ ఇన్‌స్టిట్యూట్‌లను ఏర్పాటు చేయాలని కూడా ప్రతిపాదించారు.

హిడెన్ సాఫ్ట్‌వేర్ ఎర్రర్, సర్వర్లపై విపరీతమైన ఒత్తిడి

మైక్రోసాఫ్ట్ సర్వర్ల డౌన్‌కు కారణాలు ఇవే!



ఇటీవల ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ 365 సేవలు భారీగా స్తంభించిపోవడానికి గల కారణాలను టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ అధికారికంగా వెల్లడించింది. నెట్‌వర్కింగ్ వ్యవస్థలోని ఒక అంతర్గత సాఫ్ట్‌వేర్ లోపం (హిడెన్ సాఫ్ట్‌వేర్ ఫ్లా), సర్వర్లపై ఒక్కసారిగా పెరిగిన భారీ ట్రాఫిక్ మరియు సర్వర్ల సామర్థ్యం తగ్గడం.. ఈ మూడు ప్రధాన అంశాల కలయిక వల్లే ఈ తీవ్ర అంతరాయం ఏర్పడిందని సంస్థ స్పష్టం చేసింది. నవంబర్ 12న చోటుచేసుకున్న ఈ సాంకేతిక సమస్య కారణంగా ప్రపంచవ్యాప్తంగా మైక్రోసాఫ్ట్ టీమ్స్, వన్‌డ్రైవ్, షేర్‌పాయింట్, ఆఫీస్ అప్లికేషన్ల సేవలకు తీవ్ర విఘాతం కలిగింది. ఈ పరిణామంపై మైక్రోసాఫ్ట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సోషల్ మీడియా వేదికగా వినియోగదారులకు క్షమాపణలు చెబుతూ ప్రాథమిక విచారణ వివరాలను పంచుకున్నారు.

మైక్రోసాఫ్ట్ తెలిపిన వివరాల ప్రకారం.. మైక్రోసాఫ్ట్ 365 సర్వీసులను అనుసంధానించే ఫ్రంట్-ఎండ్ నెట్‌వర్కింగ్ వ్యవస్థలో ఈ సమస్య మొదలైంది. ఒక నిర్దిష్ట పరిస్థితిలో సర్వర్లు ఓవర్‌లోడ్ అయి స్పందించకుండా పోవడానికి అక్కడ దాగివున్న సాఫ్ట్‌వేర్ లోపం కారణమైంది. వాస్తవానికి ఈ కోడ్ మార్పును జూలై నెలలోనే ప్రవేశపెట్టారు. దాదాపు మూడు నెలల పాటు ఇది ఎలాంటి ఇబ్బంది లేకుండా పనిచేసింది. సాధారణ టెస్టింగ్ ప్రక్రియలో ఉపయోగించిన హార్డ్‌వేర్, ట్రాఫిక్ పద్ధతులు రియల్-వరల్డ్ వ్యవస్థలకు భిన్నంగా ఉండటం వల్ల ఈ లోపం ముందే బయటపడలేదు.

అయితే, సర్వీసుల అంతరాయానికి సుమారు 15 గంటల ముందు టీమ్స్ ట్రాఫిక్‌ను బ్యాకప్ వ్యవస్థ నుంచి ప్రధాన వ్యవస్థకు మార్చడంతో నెట్‌వర్క్‌పై ఒక్కసారిగా రద్దీ పెరిగింది. దీనికితోడు అంతకుముందు రోజు ఎదురైన మరో సాంకేతిక సమస్య వల్ల దాదాపు 14 శాతం సర్వర్ల సామర్థ్యం అందుబాటులో లేకుండా పోయింది. ఈ కారణాలు ఒక్కటైనా పెద్దగా ప్రభావం చూపేవి కావు కానీ, రెండూ ఒకేసారి తోడవడంతో దాగివున్న సాఫ్ట్‌వేర్ లోపం తీవ్రరూపం దాల్చింది. అమెరికా పీక్ ట్రాఫిక్ వేళ విపరీతంగా రిక్వెస్టులు పేరుకుపోయి సర్వర్లు స్తంభించిపోయాయి. పరిస్థితి విషమించిన సమయంలో ఏకంగా 80 శాతానికి పైగా సర్వర్లు స్పందించడం మానేశాయి. వినియోగదారులను ఇతర సర్వర్లకు మళ్లించేందుకు ఆటోమేటిక్ వ్యవస్థలు ప్రయత్నించినప్పటికీ, అదనపు లోడ్ కారణంగా అవి కూడా మొరాయించి చైన్ రియాక్షన్ ఏర్పడింది. సమస్యను ఒకే ప్రాంతానికి పరిమితం చేసే అంతర్గత భద్రతా వ్యవస్థలు కూడా విఫలమవడంతో సమస్య ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. చివరికి ఇంజనీర్లు లోపభూయిష్టమైన కోడ్‌ను గుర్తించి, సరికొత్త అప్‌డేట్ ద్వారా వ్యవస్థను తిరిగి గాడిన పెట్టారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు, భవిష్యత్ కార్యాచరణతో కూడిన పూర్తి నివేదికను త్వరలోనే విడుదల చేయనున్నట్లు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది.

వాట్సాప్‌లో 'జాప్స్' ఫీచర్..

వాట్సాప్ 'జాప్స్' పేరుతో కొత్త ఫీచర్ అభివృద్ధి

దీని ద్వారా నేరుగా కెమెరాతో తీసిన ఫొటోలు, వీడియోలను పంపే ఛాన్స్

అవతలి వ్యక్తి చూసిన వెంటనే అవి వారి చాట్ నుంచి మాయం

ఇంకా అభివృద్ధి దశలోనే ఉన్న ఈ ఫీచర్

పబ్లిక్ బీటా వెర్షన్‌లోనూ అందుబాటులోకి



వాట్సాప్ వినియోగదారుల కోసం మరో కొత్త ఫీచర్‌ను తీసుకొచ్చేందుకు మెటా సంస్థ సిద్ధమవుతున్నట్లు సమాచారం. 'జాప్స్' పేరుతో అభివృద్ధి చేస్తున్న ఈ ఫీచర్ ద్వారా ఫొటోలు, చిన్న వీడియోలను వేగంగా పంపుకోవచ్చు. వాటిని అవతలి వ్యక్తి ఒకసారి చూసిన వెంటనే వారి స్క్రీన్ నుంచి మాయమవుతాయి. గతంలో ఈ ఫీచర్‌ను 'ఇన్‌స్టంట్స్' పేరుతో అభివృద్ధి చేయగా.. తాజాగా 'జాప్స్'గా పేరు మార్చినట్లు వాట్సాప్ అప్‌డేట్లను పరిశీలించే వాబీటాఇన్ఫో వెల్లడించింది. ఈ ఫీచర్ కోసం వాట్సాప్‌లో ప్రత్యేక కెమెరా ఇంటర్‌ఫేస్ అందుబాటులోకి రానుంది. అందులో నేరుగా ఫొటో తీయడం లేదా చిన్న వీడియో రికార్డు చేసి పంపడం సాధ్యమవుతుంది. గ్యాలరీలో ఉన్న ఫొటోలు, వీడియోలను అప్‌లోడ్ చేసే అవకాశం ఉండదు. పంపిన జాప్‌ను అవతలి వ్యక్తి చూసిన తర్వాత వారి చాట్‌లో కనిపించదు. అయితే పంపిన వారికి మాత్రం చాట్ హిస్టరీలో అవి కనిపిస్తాయని ప్రాథమిక సమాచారం. ఒకే చాట్‌లో వరుసగా పంపిన జాప్‌లను '2 జాప్స్' వంటి కౌంటర్‌తో ఒకచోట చూపించనున్నారు. సాధారణ వాట్సాప్ సందేశాల మాదిరిగానే వీటికీ 'ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్' రక్షణ ఉంటుంది. జాప్‌లను వ్యక్తిగత కాంటాక్టులతో పాటు గ్రూపులు, పబ్లిక్ ఛానళ్లకు పంపే అవకాశం కూడా ఉండొచ్చని నివేదికలు చెబుతున్నాయి. వాటిని తెరిచినప్పుడు పంపిన వ్యక్తి పేరు కనిపిస్తుంది. ఎమోజీలతో స్పందించడం, టెక్స్ట్ రిప్లై ఇవ్వడం కూడా సాధ్యమవుతుంది. అయితే ఈ ఫీచర్ ఇంకా అభివృద్ధి దశలోనే ఉంది. పబ్లిక్ బీటా వినియోగదారులకు కూడా అందుబాటులోకి రాలేదు. దీనిపై వాట్సాప్ అధికారికంగా స్పందించలేదు.

రోహిత్ శర్మ వన్డే భవిష్యత్తుపై సందిగ్ధం

చీఫ్ సెలక్టర్ ఓజా ముందు కీలక సవాల్.. జట్టా, స్నేహమా?

న్యూజిలాండ్‌తో నాలుగు వన్డే ఇన్నింగ్స్‌ల్లో 30 పరుగులే చేసిన రోహిత్

ప్రపంచకప్ బెర్త్‌పై సందేహాలు పెంచిన ఆటతీరు

అతడి భవిష్యత్తుపై నిర్ణయం తీసుకోవాల్సిన కొత్త చీఫ్ సెలక్టర్ ప్రజ్ఞాన్ ఓజా

వచ్చే ఏడాది 6 వన్డేలు ఆడనున్న భారత్

స్వదేశంలో పరుగులు చేసినా విదేశీ పరిస్థితుల్లో రాణించగలడా అన్నది కీలకం



టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ భవిష్యత్తుపై ఇప్పుడు ఆసక్తికర చర్చ మొదలైంది. వచ్చే ఏడాది దక్షిణాఫ్రికా వేదికగా జరగనున్న వన్డే ప్రపంచకప్‌లో అతడికి చోటు దక్కుతుందా? అన్న ప్రశ్నకు కొత్త చీఫ్ సెలక్టర్ ప్రజ్ఞాన్ ఓజా సమాధానం చెప్పాల్సి ఉంది. న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగు వన్డే ఇన్నింగ్స్‌ల్లో రోహిత్ కేవలం 30 పరుగులే చేయడం ఈ చర్చకు కారణమైంది. ఫామ్ కోల్పోయినప్పటికీ ఆట (కెరీర్) కొనసాగించాలన్న అతడి పట్టుదల.. సెలక్టర్లకు చిక్కుముడిగా మారింది. జూనియర్ క్రికెట్ రోజుల నుంచి రోహిత్, ఓజా మధ్య స్నేహం ఉంది. గతంలో నేషనల్ క్రికెట్ అకాడమీలో జరిగిన శిక్షణ శిబిరాల సమయంలోనూ వారి అనుబంధం బలపడింది. ఇప్పుడు ఓజా సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడంతో రోహిత్ విషయంలో కఠిన నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యక్తిగత అనుబంధాన్ని పక్కనపెట్టి, ఆటగాడి ప్రస్తుత సామర్థ్యం, ప్రపంచకప్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ ఏడాది ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు ముందు అప్పటి చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ సూచనతో ఓజా.. రోహిత్‌తో సమావేశమయ్యాడు. లార్డ్స్‌లో జరిగే మ్యాచ్ సందర్భంగా వన్డేలకు వీడ్కోలు పలికేందుకు సిద్ధంగా ఉన్నాడా? అన్నది తెలుసుకోవడమే ఆ భేటీ ఉద్దేశం. అయితే ఆ ప్రతిపాదనపై రోహిత్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. భారత క్రికెట్‌ను నడిపిస్తున్న వారిపై తన అసహనాన్ని కూడా వెల్లడించాడు. ఆ పరిణామాల తర్వాత అగార్కర్-రోహిత్ మధ్య వ్యక్తిగత సంబంధాలు దెబ్బతిన్నాయని వార్తలు వచ్చాయి. ఇప్పుడు అగార్కర్ స్థానంలో వచ్చిన ఓజాకు ఆ బాధ్యత బదిలీ అయింది. న్యూజిలాండ్‌తో సిరీస్‌లో టాప్ ఆర్డర్ పదేపదే కుప్పకూలడంపై కోచ్ గౌతమ్ గంభీర్ ఆందోళన వ్యక్తం చేశాడు. అయితే భారత్ బౌలర్లు అద్భుతంగా రాణించడంతో సిరీస్‌ను 3-1తో గెలుచుకుంది. రోహిత్ కూడా సీమింగ్, బౌన్స్ ఉన్న పిచ్‌లపై ఇబ్బంది పడ్డాడు. వెస్టిండీస్‌తో స్వదేశంలో రాణించినప్పటికీ, న్యూజిలాండ్‌లో పరిస్థితుల్లో అతడి వైఫల్యాలు కొట్టొచ్చినట్టు కనిపించాయి. బౌన్స్‌ను ఎదుర్కోవడం, పవర్‌ప్లేలో నిలదొక్కుకోవడం అతడికి సవాలుగా మారాయి. కొన్ని సందర్భాల్లో ఆడాలన్న మనసుకు, శరీర స్పందనకు మధ్య సమన్వయం కనిపించడం లేదని విశ్లేషణ పేర్కొంది.

ప్రపంచకప్‌కు ముందు భారత్ స్వదేశంలో మరో 6 వన్డేలు ఆడనుంది. ఆ తర్వాత 6 నెలల విరామం ఉంటుంది. శ్రీలంక, జింబాబ్వేలతో స్వదేశంలో జరిగే మ్యాచ్‌ల్లో రోహిత్ భారీ స్కోర్లు సాధించే అవకాశం ఉందని అంచనా. అయితే స్వదేశంలో పరుగులు చేసినంత మాత్రాన విదేశీ పరిస్థితుల్లోనూ రాణిస్తాడని సెలక్టర్లు భావించకపోవచ్చు. ఐపీఎల్ ఆడే ముందు దాదాపు మూడు నెలల విరామం ఉండటం కూడా అతడి ఫామ్‌పై ప్రభావం చూపుతుందా అన్న సందేహాలున్నాయి. రోహిత్ విజయ్ హజారే ట్రోఫీలో ఆడే అవకాశమూ ఉంది. అయితే దేశవాళీ వన్డే టోర్నీలో పాల్గొనడం కంటే, అక్కడి ప్రదర్శనలో స్థిరత్వం చూపించడం ముఖ్యం. ముఖ్యంగా కఠిన పరిస్థితుల్లో అతడి ఆటతీరును అంచనా వేయాల్సి ఉంటుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా భారత క్రికెట్‌కు సేవలందించిన ఆటగాడికి గౌరవప్రదమైన వీడ్కోలు దక్కాలన్న అందరి ఆశ. అయితే ప్రస్తుతానికి రోహిత్, ఓజా మధ్య బహిరంగంగా, స్పష్టంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచకప్ ప్రణాళికల్లో తన స్థానం ఏంటో రోహిత్‌కు తెలియాలి. అతడి ప్రస్తుత సామర్థ్యం, భవిష్యత్తు ప్రణాళికలపై సెలక్షన్ కమిటీకి కూడా స్పష్టత రావాలి. వచ్చే ఏడాది స్వదేశంలో జరిగే వన్డే సిరీస్‌లో చివరి మ్యాచ్ ముంబైలోని వాంఖడే స్టేడియంలో జింబాబ్వేతో జరగనుంది. రోహిత్ కెరీర్‌లో ఆ మ్యాచ్ కీలక మలుపుగా మారుతుందా? న్యూజిలాండ్ సిరీస్ తర్వాత ఈ ప్రశ్నకు ప్రాధాన్యం పెరిగింది.

స్పోర్ట్స్

రజత్ పటీదార్ విధ్వంసం..

48 బంతుల్లోనే 135 పరుగులు.. రికార్డుల మోత!

సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో రజత్ విధ్వంసకర ఇన్నింగ్స్

కేవలం 48 బంతుల్లోనే 13 సిక్సర్లు, 8 ఫోర్లతో 135 పరుగులు

మధ్యప్రదేశ్ తరఫున ఈ టోర్నీలో సెంచరీ చేసిన తొలి బ్యాటర్‌గా రికార్డు

శివాంగ్ కుమార్‌తో కలిసి 62 బంతుల్లోనే 153 పరుగుల భారీ భాగస్వామ్యం

గాయాల కారణంగా ఇటీవలే ఇండియా 'ఏ' జట్టు నుంచి తప్పుకున్న పటీదార్



సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో మధ్యప్రదేశ్ కెప్టెన్ రజత్ పటీదార్ విధ్వంసకర బ్యాటింగ్‌తో అదరగొట్టాడు. న్యూ చండీగఢ్‌లో అస్సాంతో జరిగిన మ్యాచ్‌లో కేవలం 48 బంతుల్లోనే అజేయంగా 135 పరుగులు బాదాడు. అతని మెరుపు ఇన్నింగ్స్ ఫలితంగా మధ్యప్రదేశ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 250 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఈ ఇన్నింగ్స్‌లో రజత్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. మొత్తం 13 సిక్సర్లు, 8 ఫోర్లు బాదాడు. కేవలం 41 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకోవడం విశేషం. దీంతో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ చరిత్రలో మధ్యప్రదేశ్ తరఫున సెంచరీ నమోదు చేసిన తొలి బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. అంతేకాకుండా ఒకే ఇన్నింగ్స్‌లో 13 సిక్సర్లు బాది, రాష్ట్రం తరఫున ఈ టోర్నీలో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఆటగాడిగానూ మరో ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. మధ్యప్రదేశ్ జట్టు 8వ ఓవర్లో 57 పరుగులకు 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్నప్పుడు రజత్ క్రీజులోకి వచ్చాడు. ఏమాత్రం సమయం తీసుకోకుండా అస్సాం బౌలర్లపై ఎదురుదాడికి దిగి మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. మూడో నంబర్‌లో వచ్చిన శివాంగ్ కుమార్‌తో కలిసి అద్భుతమైన భాగస్వామ్యం నెలకొల్పాడు. వీరిద్దరూ కలిసి కేవలం 62 బంతుల్లోనే 153 పరుగులు జోడించారు. ఇది ఈ టోర్నీలో మధ్యప్రదేశ్‌కు రెండో అత్యధిక భాగస్వామ్యం. తన ఇన్నింగ్స్ మొత్తంలో రజత్ కేవలం ఐదు డాట్ బాల్స్ మాత్రమే ఆడటం అతని దూకుడుకు నిదర్శనం. ఇటీవల గాయాల కారణంగా 50 ఓవర్ల ఫార్మాట్‌కు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్న రజత్, ఈ ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. నవంబర్ 19 నుంచి 29 వరకు దోహాలో జరగనున్న రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ కోసం ప్రకటించిన ఇండియా 'ఏ' జట్టుకు తొలుత వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. అయితే, ఆ జట్టు నుంచి తాను తప్పుకుంటున్నట్లు బీసీసీఐకి తెలియజేశాడు. ఈ నేపథ్యంలో టీ20 ఫార్మాట్‌లో అతను ఇంతటి విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడటం ప్రాధాన్యం సంతరించుకుంది.



ఆది సాయికుమార్ కొత్త సినిమా.. ఆసక్తిగా టైటిల్

ఆది సాయికుమార్ హీరోగా వస్తోన్న లేటెస్ట్ మూవీ అరుంధతి నక్షత్రం. ఈ చిత్రంలో మేఘ శెట్టి, మధు దామరాజు హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో డైరెక్టర్ రాహుల్ శ్రీనివాస్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని 7 పి.ఎం. ప్రొడక్షన్స్, శ్రీ చక్ర మూవీస్ ఎల్ఎల్పీ బ్యానర్స్‌పై సందీప్ అగరం, అమ్మిత రెడ్డి బాసాని, డా.సూర్యకాంతి కూచిభొట్ల నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ షూటింగ్ హైదరాబాద్‌లో గ్రాండ్‌గా ప్రారంభమైంది. ఈ మూవీ పూజా కార్యక్రమంలో ముహూర్తపు సన్నివేశానికి నటుడు సాయి కుమార్ క్లాప్ ఇచ్చారు. ప్రొడ్యూసర్స్ రమేష్ పుప్పాల, సూర్యకాంతి కూచిభొట్ల కెమెరా స్విచ్ఛాన్ చేశారు. చిత్ర నిర్మాతలు స్క్రిప్ట్ అందించారు. ఈ మూవీ ఆది సాయికుమార్ కెరీర్‌లో 28వ సినిమాగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా అనౌన్స్ మెంట్ స్పెషల్ వీడియో గ్లింప్స్ రిలీజ్ చేశారు. ఈ వీడియో చూస్తుంటే ఒక మంచి రూరల్ ఫ్యామిలీ డ్రామా అని అర్థమవుతోంది. ఈ నెలలోనే అరుంధతి నక్షత్రం రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ చిత్రానికి సురేశ్ బొబ్బిలి సంగీతమందిస్తున్నారు.

రామాయణం బాక్సాఫీస్ సునామీ.. సెకండ్ సండే రూ.75 కోట్ల వసూళ్లు ధురంధర్ 2 రికార్డు బద్దలు!



బాక్సాఫీస్ వద్ద 'రామాయణం పార్ట్ 1' ప్రభంజనం కొనసాగుతోంది. భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ విజువల్ వండర్ కలెక్షన్ల విషయంలో సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌బీర్ కపూర్ శ్రీరాముడిగా, నేచురల్ బ్యూటీ సాయి పల్లవి సీతాదేవిగా, రాకింగ్ స్టార్ యశ్ రావణుడిగా నటించిన ఈ చిత్రం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. దీపావళి పండుగ సందర్భంగా విడుదలైన ఈ సినిమా మొదటి వారంలోనే భారీ వసూళ్లు సాధించగా, రెండో వారాంతంలోనూ అదే జోరును కొనసాగించింది. ముఖ్యంగా రెండో ఆదివారం నమోదైన కలెక్షన్లు ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి. ఈ క్రమంలోనే 'ధురంధర్ 2' పేరిట ఉన్న సెకండ్ సండే రికార్డును కూడా రామాయణం అధిగమించినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. 'రామాయణం' సినిమా రెండో వారాంతంలోనూ బాక్సాఫీస్ వద్ద తన ఆధిపత్యాన్ని చాటుకుంది. నవంబర్ 15, ఆదివారం ఈ చిత్రం భారతదేశంలో సుమారు రూ.75 కోట్ల నెట్ వసూళ్లు సాధించినట్లు సాక్నిల్క్ గణాంకాలు వెల్లడించాయి. అంతకుముందు శనివారం నమోదైన రూ.72.90 కోట్లతో పోలిస్తే ఆదివారం కలెక్షన్లు మరింత పెరగడం విశేషం. సాధారణంగా సినిమాలకు మొదటి వారాంతం తర్వాత వసూళ్లు తగ్గుతుంటాయి. కానీ 'రామాయణం' విషయంలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. రెండో ఆదివారం కూడా ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో థియేటర్లకు రావడంతో ఈ సినిమా మరో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకుంది. రెండో ఆదివారం అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల జాబితాలో 'రామాయణం' సరికొత్త రికార్డును నమోదు చేసింది. ఇప్పటివరకు ఈ విషయంలో 'ధురంధర్ 2' సాధించిన రూ.68 కోట్ల వసూళ్లు రికార్డుగా ఉన్నాయి. అయితే రామాయణం రెండో ఆదివారం రూ.75 కోట్లు సాధించినట్లు వచ్చిన గణాంకాలతో ఆ రికార్డు బద్దలైంది. దీంతో రెండో ఆదివారం అత్యధిక కలెక్షన్లు సాధించిన సినిమాల జాబితాలో రామాయణం అగ్రస్థానానికి చేరినట్లు ట్రేడ్ వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా రెండో వారంలోనూ కలెక్షన్లు పెరుగుతుండటం ఈ సినిమా బాక్సాఫీస్ బలాన్ని తెలియజేస్తోంది. 'రామాయణం' సినిమా వసూళ్ల జోరు ఇతర భారీ చిత్రాల లైఫ్‌టైమ్ కలెక్షన్లపై కూడా ప్రభావం చూపిస్తోంది. ఇప్పటివరకు ఈ చిత్రం భారత్‌లో సుమారు రూ.760.60 కోట్ల నెట్ వసూళ్లు సాధించినట్లు సాక్నిల్క్ గణాంకాలు వెల్లడించాయి. ఈ క్రమంలో షారుఖ్ ఖాన్ నటించిన 'జవాన్' రూ.643.87 కోట్ల లైఫ్‌టైమ్ నెట్ కలెక్షన్లను అధిగమించింది. అలాగే రాజ్‌కుమార్ రావ్ నటించిన 'స్త్రీ 2' రూ.625.27 కోట్లు, విక్కీ కౌశల్ 'ఛావా' రూ.601.57 కోట్లు, షారుఖ్ ఖాన్ 'పఠాన్' రూ.544.28 కోట్లు, రణ్‌బీర్ కపూర్ 'యానిమల్' రూ.556.36 కోట్ల వసూళ్లను కూడా దాటేసినట్లు సమాచారం. ఒకే సినిమాతో ఇన్ని భారీ చిత్రాల రికార్డులను అధిగమించడం ఇప్పుడు బాలీవుడ్‌లో పెద్ద చర్చగా మారింది.

తేజ సజ్జా నిశ్చితార్థం.. తెలంగాణ గవర్నర్ స్పెషల్ విషెస్



టాలీవుడ్ యువ హీరో తేజ సజ్జా త్వరలో ఓ ఇంటివాడు కాబోతున్నారు. ఆయన నిశ్చితార్థ వేడుక హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ తాజ్ కృష్ణ హోటల్‌లో ఘనంగా జరిగింది. ఇప్పటికే పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఈ వేడుకకు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. తాజాగా తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా సైతం ఈ వేడుకకు విచ్చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా కాబోయే దంపతులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. వారి వైవాహిక జీవితం ప్రేమ, సంతోషం, సామరస్యంతో నిండాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు నెట్టింట సందడి చేస్తున్నాయి.



ఆకాశంలో ఓ తార ట్రైలర్ విడుదల.. అమ్మాయి కలకు అండగా దుల్కర్ సల్మాన్..!

మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ తెలుగు ప్రేక్షకులకు కూడా ఎంతో చేరువయ్యారు. ఆయన నటించే సినిమాలకు తెలుగులోనూ మంచి ఆదరణ లభిస్తోంది. ఈ క్రమంలో ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా తెలుగు చిత్రం 'ఆకాశంలో ఓ తార' ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమైంది. నవంబర్ 20న ఈ సినిమా తెలుగు, మలయాళం, హిందీ, తమిళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్రబృందం తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్‌తో ఆసక్తిని పెంచిన ఈ సినిమా.. ట్రైలర్‌తో ప్రేక్షకుల్లో మరింత అంచనాలను పెంచుతోంది. ఈ చిత్రంలో సాత్విక వీరవల్లి ..కల్పన అనే గ్రామీణ యువతి పాత్రలో కనిపించనుంది. చిన్న గ్రామంలో జీవించే కల్పనకు వ్యోమగామి కావాలనే పెద్ద కల ఉంటుంది. తన పరిస్థితులు, ఎదురయ్యే అడ్డంకులు ఎన్ని ఉన్నా ఆ లక్ష్యాన్ని సాధించాలని ఆమె పట్టుదలగా ప్రయత్నిస్తుంది. ఈ ప్రయాణంలో కృష్ణ అనే పాత్రలో నటించిన దుల్కర్ సల్మాన్ ఆమెకు అండగా నిలుస్తాడు. కల్పన కలను నిజం చేయడానికి కృష్ణ ఎలా తోడ్పడ్డాడు? ఆమె ఎదుర్కొన్న సవాళ్లను అధిగమించేందుకు ఎలా సహాయం చేశాడు? అనే అంశాల చుట్టూ ఈ కథ సాగనుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాల ద్వారా సినిమా కథలోని ప్రధాన అంశాలు ప్రేక్షకులకు కొంతవరకు పరిచయమయ్యాయి. తాజాగా వచ్చిన ట్రైలర్ మాత్రం కథలోని భావోద్వేగాలను మరింత బలంగా చూపించింది. ముఖ్యంగా ఓ సాధారణ గ్రామీణ అమ్మాయి అంతరిక్షంలోకి వెళ్లాలనే అసాధారణమైన కలను సాకారం చేసుకోవడానికి చేసే ప్రయత్నాలు ఆకట్టుకుంటున్నాయి. ఆమెకు అండగా నిలిచే కృష్ణ పాత్ర సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. ట్రైలర్‌ను ఆసక్తికరంగా కట్ చేశారు. హృదయాన్ని తాకే సంభాషణలు, మనసుకు హత్తుకునే నేపథ్య సంగీతం కథకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. కల్పన కల, ఆమె ప్రయాణంలో ఎదురయ్యే కష్టాలు, కృష్ణ ఇచ్చే ధైర్యం.. ఇలా ప్రతి అంశాన్ని భావోద్వేగభరితంగా చూపించారు. ట్రైలర్ చూస్తుంటే వెండితెరపై ఈ కథను చూడాలనే ఆసక్తి కలుగుతోంది. ఈ సినిమాలో దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లితో పాటు శ్రుతి హాసన్, స్వాసిక, మురళీ శర్మ, రుహానీ శర్మ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నటీనటుల ప్రదర్శనలు కూడా సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా కనిపిస్తున్నాయి. నిర్మాణ విలువలు రిచ్‌గా ఉండటంతో పాటు, కథకు తగ్గట్టుగా విజువల్స్‌ను రూపొందించినట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. 'ఆకాశంలో ఓ తార' చిత్రానికి పవన్ సాదినేని దర్శకత్వం వహిస్తున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్‌బాక్స్ మీడియా, వైజయంతీ మూవీస్ సంస్థలు సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఈ సినిమా నవంబర్ 20న తెలుగు, మలయాళం, హిందీ, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది.

ఇంట్లో దెయ్యం ఉందని భయపడిన శృతి హాసన్..

కదిలే బొమ్మతో వణికిపోయా అంటూ షాకింగ్ కామెంట్స్!



దెయ్యాలు, ఆత్మలు, అతీంద్రియ శక్తులు ఉన్నాయా? లేవా? అనే ప్రశ్నకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానం లేదు. పారానార్మల్ యాక్టివిటీస్ గురించి ప్రపంచవ్యాప్తంగా ఎన్నో కథలు, అనుభవాలు ప్రచారంలో ఉన్నాయి. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు కొందరు తమ జీవితాల్లో ఎదురైన వింత సంఘటనలను పలు సందర్భాల్లో వెల్లడించారు. తాజాగా ఈ జాబితాలో స్టార్ హీరోయిన్ శృతి హాసన్ కూడా చేరారు. తన ఇంట్లో ఓ బొమ్మ కారణంగా ఎదురైన భయానక అనుభవాన్ని ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఆ బొమ్మ తనకు నిద్రలేని రాత్రులను మిగిల్చిందని, చివరకు దాన్ని ఇంటి నుంచి బయటకు పంపించాల్సి వచ్చిందని వెల్లడించారు. ప్రస్తుతం ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. తనకు ఎదురైన వింత అనుభవం గురించి శృతి హాసన్ మాట్లాడుతూ.. చెన్నైలోని తన ఇంట్లో కొన్ని సందర్భాల్లో ఏవో అదృశ్య శక్తులు ఉన్నట్లు అనిపించేదని చెప్పారు. అయితే ప్రతిసారీ ఇలాంటి అనుభవాలు ఎదురుకాలేదని, కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే వింత సంఘటనలు జరిగేవని వెల్లడించారు.తన దగ్గర మనిషి పరిమాణంలో ఉండే ఓ బొమ్మ ఉండేదని, దానికి ఫియోనా అని పేరు పెట్టుకున్నానని తెలిపారు. తన స్నేహితులు ఇంటికి వచ్చినప్పుడు కూడా ఆ బొమ్మను పలకరించేవారని చెప్పారు. అంతేకాకుండా ఆ బొమ్మను అల్మారాలో పెట్టి దానిపై రకరకాల బొమ్మలు గీస్తూ ఉండేవారట. మొదట్లో అదొక సాధారణ బొమ్మగానే భావించినప్పటికీ, ఆ తర్వాత జరిగిన కొన్ని సంఘటనలు తనను తీవ్రంగా భయపెట్టాయని శ్రుతి వివరించారు. ఆ బొమ్మ విషయంలో తనకు ఎదురైన అత్యంత భయానక అనుభవాన్ని కూడా శ్రుతి హాసన్ వెల్లడించారు.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999